జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php




సంపుటి 7 సంచిక 147 | హైదరాబాద్, ఆగష్టు 10 గురువారం 2023 | 8 పేజీలు | వెల : 5.00

## దళిత బంధు రెండో విడత అమలుకు ...

# రంగం సిద్ధం..



### ఈసారి ఎంత మందికి అవకాశమంటే ?

హైదరాబాద్: దళిత బంధు రెండో విడత అమలుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. వచ్చేవారం లోపల దళిత బంధు ఆర్థిక సాయానికి దరఖాస్తులు అధికారులు సమర్పించాలని.. లబ్ధిదారులను ఎంపిక చేసుకునే విషయంలో కూడా పారదర్శకత పాటించాలని మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ అధికారులను కోరారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో మంగళవారం రోజున దళిత బంధు రెండోవిడతకు సంబంధించి మంత్రులు సమీక్ష నిర్వహించారు. అయితే ఈ సందర్భంగా వారు పలు వ్యాఖ్యలు చేశారు. ప్రతి నియోజకవర్గానికి 1100 మంది లబ్ధిదారులను అత్యంత పారదర్శకంగా ఎంపిక చేయాలని పేర్కొన్నారు. మరో విషయం ఏంటంటే మొదటి దశలో పంపిణీ చేసినటువంటి యూనిట్ల పై దృష్టి పెట్టాలని సూచనలు చేశారు.ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులతో కలిసి దళిత బంధు రెండో విడద, అలాగే లబ్ధిదారులపై మంత్రులు సుధీర్ఘంగా చర్చించారు. అలాగే ఆర్థికంగా వెనుకబడిన దళిత వర్గాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ గొప్పపథకాన్ని తీసుకొచ్చారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. దేశంలో ఎక్కడా కూడా ఇలాంటి పథకం అమలు కావడం లేదని చెప్పారు. అలాగే ఈ పథకం రింద అర్హులైన ఒక్కొక్క కుటుంబానికి వది లక్షల రూపాయల ఆర్థిక సాహయం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మొదటి విడతలో ముందుగా 100 మంది చొప్పున లబ్ధిదారులను ఎంపిక చేశామని.. ఆ తర్వాత వారు కొరుకున్న యూనిట్‌ను అందజేశామని చెప్పారు. అలాగే రెండో విడత అమలులో ఒక్కో నియోజకవర్గానికి 1100 మంది చొప్పున లబ్ధిదారులను ఎంపికి చేసి ఆర్థిక సాయం చేయనున్నామని చెప్పారు. దళిత బంధు కోసం వచ్చిన దరఖాస్తులను రెండు, మూడు రోజుల్లోనే సమగ్ర విచారణ చేయాలని అధికారులకు ఆదేశించారు.

## రెండవ సారి చంద్రుని చుట్టిన

# చంద్రయాన్-3

### ఈ నెల 14 న మూడవ రౌండ్ పూర్తి

సూళ్లూరుపేట (తిరుపతి) : శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రం నుండి గత నెల 14 వ తేదీ ఇస్రో చంద్రయాన్-3 మిషన్‌ను విజయవంతంగా ప్రయోగించింది. ఈ చంద్రయాన్ - 3 మిషన్ ఇప్పుడు చంద్రుని చెంతకు చేరుకొని జాబిలి చుట్టూ లూనార్ కక్షలో తిరుగుతూ ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. చంద్రునికి 174 కిలోమీటర్లు సమీప కక్ష నుండి 1437 కిలోమీటర్లు దూరపు కక్షలో తిరిగి రెండవ రౌండ్‌ను పూర్తి చేసిందన్నారు. ఇలా మరో నాలుగు సార్లు తిరిగిన తరువాత చంద్రుని పైకి ల్యాండ్ కాన్నుట్లు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 1:30 గంటలకు చంద్రయాన్-3 మిషన్ చంద్రుని చుట్టూ తిరిగే రెండవ రౌండ్‌ను విజయ వంతముగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఇక చంద్రుని కక్షలో మూడవ రౌండ్‌ను ప్రారంభించి, ఈ నెల 14 తేదీ ఉదయం 11:30 నుండి 12:30 గంటల మధ్యన మూడవ రౌండ్‌ను పూర్తి చేస్తుందన్నారు.




## కేరళ రాష్ట్రం పేరును మార్చేందుకు

# అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం



కేరళ: కేరళ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రం పేరును మార్చుతూ సంచలన నిర్ణయం తీసుకుంది. కేరళ పేరు త్వరలో 'కేరళం'గా మారనుంది. ఇందుకోసం బుధవారం కేరళ అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. తీర్మానాన్ని సమర్పిస్తూ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని మలయాళంలో 'కేరళం' అని పిలుస్తారని, అయితే ఇతర భాషల్లో ఇప్పటికీ కేరళ అని అన్నారు. సెక్షన్ 118 కింద ప్రతిపాదనను సీఎం విజయన్ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా అన్ని అధికారిక పత్రాలలో, రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో కేరళ పేరును 'కేరళం'గా మార్చాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ ప్రతిపాదనను కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష యూడీఎఫ్ ఎటువంటి సవరణ లేదా మార్పు సూచించకుండా ఆమోదించింది. దీని తర్వాత అసెంబ్లీ స్పీకర్ ఏఎన్ శ్యాంసీర్ మద్దతు ఆధారంగా ఈ ప్రతిపాదనను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం కేరళను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో 'కేరళం'గా చేర్చాలి. రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్‌లో మన రాష్ట్రం కేరళ పేరు రాసి ఉందని కేరళ ముఖ్యమంత్రి విజయన్ అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం కేరళగా సవరించి, రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్‌లో పేర్కొన్న అన్ని భాషలలో పేరును 'కేరళం'గా మార్చడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఏకగ్రీవంగా కోరుతున్నామని అన్నారు. జాతీయ స్వాతంత్ర్య పోరాటం ప్రారంభమైనప్పటి నుంచి మలయాళం మాట్లాడే వారని, ఒక కేరళలో విలీనం కావాల్సిన అవసరం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం కేరళగా సవరించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఈ అసెంబ్లీ కేంద్ర ప్రభుత్వాన్ని ఏకగ్రీవంగా అభ్యర్థించింది. అలాగే అన్ని భాషలలో మన రాష్ట్రాన్ని కేరళంగా మార్చాలని అభ్యర్థిస్తోంది.

## బీఆర్ఎస్ పార్టీకి తెలంగాణ గల్లీలో బాసులు ఉంటే..

# కాంగ్రెస్, బీజేపోళ్లకు ఢిల్లీలో బాసులు ఉన్నారు

### బీజేపీ, కాంగ్రెసోళ్లపై కేటీఆర్ ఘాటు విమర్శలు



నిజామాబాద్ : రాష్ట్రంలో అధికారపక్షంలో అనవసర ఆరోపణలు చేస్తున్న ప్రతి పక్షాలపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ పార్టీకి తెలంగాణ గల్లీలో బాసులు ఉంటే.. కాంగ్రెస్, బీజేపోళ్లకు ఢిల్లీలో బాసులు ఉన్నారని పేర్కొన్నారు. ఆఖరికి అది పోయాలన్నా కూడా ఢిల్లీకి పోవాలే అని కాంగ్రెస్, బీజేపీ పార్టీలను ఉద్దేశించి కేటీఆర్ విమర్శలు చేశారు. నిజామాబాద్ జిల్లాలో ఐటీ టవర్, న్యాక్ భవనం ప్రారంభించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు.బీఆర్ఎస్ పార్టీకి బాసులు తెలంగాణ గల్లీల్లో ఉన్నారని కేటీఆర్ తెలిపారు. మాకు బాసులు ఎక్కడ్నో ఢిల్లీలో లేరు. గల్లీలో ఉన్నరు. మీరు ఇక్కడ చెప్పడం ఆలస్యం.. అక్కడ పనులు అవుతాయి. రైతుబంధు, రైతుబీమా, దళిత బంధు ఆలోచన రాగానే కేసీఆర్ అమలు చేశారు.

(మిగతా 2లో..)

## తిన్నరేవును, చేసిన సేవను

# మరువొద్దు : మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేట : ఒకప్పుడు చుక్క నీరు లేని సిద్దిపేట ప్రాంతాన్ని రిజర్వాయర్ల ఖిల్లాగా మార్చుకున్నం. నాలుగేళ్లుగా బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాల కోసం ప్రయత్నిస్తున్నాం. మెడికల్, వెటర్నరీ, అగ్రికల్చర్ ఇనిస్టిట్యూట్స్ సిద్దిపేటకు తెచ్చుకున్నాం. సెప్టెంబర్ 13న బి ఫార్మసీ కళాశాల ప్రారంభించుకుంటాం. అన్ని రకాల చదువులు, ఆలయాలు, రిజర్వాయర్లకు ఖిల్లా అయిన సిద్దిపేటను చదువులకు సైతం నిలయంగా మార్చుకున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు.బుధవారం సిద్దిపేట రూరల్ మండలం తోర్నాలలో రూ. 48 కోట్లతో చేపట్టిన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా వ్యవసాయ డిగ్రీ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు.. తెలంగాణ వచ్చాక నేడు 80 రెసిడెన్షియల్ కాలేజీలు ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో తెలంగాణ రాక ముందు 682 మాత్రమే ఉన్న రెసిడెన్షియల్ స్కూల్స్ నేడు 1012 స్కూల్స్ ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు.గత ప్రభుత్వాలు ఒక్కటంటే ఒక్క డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేయలేదు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న సేవలను గుర్తించాలి. సద్దితిన్న రేవు తలవాలి.

(మిగతా 2లో..)

# మణిపూర్‌లో 'భారతమాత' ను హత్య చేశారు: రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ : మణిపూర్‌లో భారతమాతను హత్య చేశారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. పార్లమెంటులో అవిశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా బుధవారం రాహుల్ గాంధీ మాట్లాడారు. అధికార బిజెపి పార్టీలోని సభ్యులు దేశద్రోహులు అని ధ్వజమెత్తారు. మణిపూర్ మండిపోతుంటే ప్రధాని ఆరాష్ట్రంలో ఎందుకు పర్యటించలేదని నిలదీశారు. అంటే ఆ రాష్ట్రాన్ని భారతదేశంలో భాగమని ప్రధాని భావించడం లేదా అని ప్రశ్నించారు.ఇటీవల తాను మణిపూర్ వెళ్లానని, కానీ ప్రధాని ఇప్పటి వరకు ఆరాష్ట్రానికి వెళ్లలేదని అన్నారు. తాను మణిపూర్ అనే పదాన్ని ఉపయోగించాను కానీ వాస్తవానికి అక్కడ మణిపూర్ మిగిలిలేదని .. ఆ రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేశారని దుయ్యబట్టారు." కొన్ని రోజుల క్రితమే నేను మణిపుర్ వెళ్లాను. అక్కడి పునరావాస శిబిరాల్లో మహిళలు, పిల్లలతో మాట్లాడాను. మీకు ఏమి జరిగింది..? అని ఓ మహిళను ప్రశ్నించా.. ఆమె మాట్లాడుతూ.. 'నా ఒక్కగానొక్క కొడుకును కళ్లెదుటే కాల్చిచంపారు. ఆ రోజు రాత్రి మొత్తం నా బిడ్డ శవం వద్దే పడి ఉన్నాను. ఆ తర్వాత నాకు భయం వేసింది. చివరికి కట్టుబట్టలతో వచ్చినట్లు చెప్పింది " అని అన్నారు. ఓ ఫొటో మాత్రం చూపిందని అన్నారు. "మరో క్యాంపులో ఓ సోదరిని ప్రశ్నించగా..ఆమె భయంతో వణికిపోయింది. ఆ తర్వాత స్పృహ కోల్పోయింది. మీకు రెండు ఉదాహరణలు మాత్రమే చెప్పాను. బిజెపి రాజకీయాలు మణిపూర్‌ను చంపలేదు, కానీ మణిపూర్‌లో భారత దేశాన్ని హత్య చేసింది. మణిపూర్‌లో భారతదేశం హత్య చేయబడింది మణిపూర్ ప్రజలను చంపడం ద్వారా మీరు భారత మాతను హత్య చేశారు. మీరు దేశ భక్తులు కాదు.. దేశద్రోహులు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. "మణిపుర్‌లో భారత్‌ను హత్య చేశారు. దేశం ప్రాణం తీశారు. అందుకే మీ ప్రధాని మణిపుర్‌కు వెళ్లడంలేదు" అని బిజెపి పై విరుచుకుపడ్డారు. "మీరు ఎక్కడికక్కడ కిరోసిన్ చల్లుతున్నారు. మీరు మణిపూర్‌కు నిప్పుపెట్టారు. ఇప్పుడు హర్యానాలోనూ అదే పనిచేస్తున్నారు" అని అన్నారు. ఇటీవల నుహ్, గురుగ్రామ్ జిల్లాల్లో చోటుచేసుకున్న మత ఘర్షణలను ప్రస్తావించారు. రావణుడు ఇద్దరి మాటలను మాత్రమే చెవికెక్కించుకున్నట్లే, అలాగే ప్రధాని మోడీ అమిత్ షా, అదానీల మాటలను మాత్రమే వింటారని అన్నారు. భారత్ జోడో యాత్ర గురించి కూడా రాహుల్ లోక సభలో వివరించారు.



# దేశానికి నాగరికత నేర్పిందే ఆదివాసిలు



ఆసిఫాబాద్ జిల్లా ఆగస్టు 9 (ప్రజాపాలన,ప్రతినిధి) : తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం 29వ ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. టిఏజిఎస్ జిల్లా అధ్యక్షులు ఆదివాసి జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కమిటీ సభ్యులు కోట శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ ప్రపంచంలో మొట్టమొదటిసారిగా ఆదివాసీగా పుట్టింది, దేశానికి నాగరికత నేర్పింది, నా ఆదివాసులే అని, ఈ దేశానికి మూలవాసులని అన్నారు. అలాంటి ఆదివాసుల పైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక దాడులు చేయిస్తూ అడవుల నుంచి వెళ్లగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, ఆర్టికల్ 107 చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. ఆదివాసుల హక్కులను కాల రాస్తే తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ఊరుకోదని ప్రభుత్వానికి సవాల్ చేశారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ప్రతి ఒక్కరు జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం టీఏజీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్, దామోదర్, ప్రకాష్ డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్, కెవిపిఎస్ రాజ్ కుమార్, టీకానంద్, తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా ఫోటో వీడియో గ్రాఫర్ మహాసభ






ఇబ్రహింపట్నం ఆగస్టు తేదీ 9 ప్రజాపాలన ప్రతినిది: ఫోటోగ్రాఫర్స్ వీడియో గ్రాఫర్స్ ఇబ్రహీంపట్నం చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి రంగారెడ్డి జిల్లా మహాసభకు ఫోటో వీడియో గ్రాఫర్స్ 20 మండలాల ఫోటోగ్రాఫర్లు జయప్రదం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫోటో అధ్యక్షులు హుస్సేన్ వ్యవస్థాప అధ్యక్షులు వెంకట్ రెడ్డి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు లింగస్వామి శేఖర్ మల్లేష్ రంగారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షులు ముదిగొండ అజయ్ ముఖ్య అతిథులుగా ఎక్సైజ్ క్రీడలు. సాంస్కృతిక శాఖ మంత్రులు వి శ్రీనివాస్ గౌడ్ చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి కల్వకుర్తి జైపాల్ యాదవ్ ఇబ్రహీంపట్నం సీనియర్ టిఆర్ఎస్ నాయకులు క్యామ మల్లేష్ ఎంపీపీ రూపేష్ మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్ రెడ్డి అబ్దుల్లాపూర్మెట్ జెడ్పిటిసి బింగి దాస్ తదితరులు పాల్గొన్నారు ఇబ్రహీంపట్నం ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ నాగేష్ లక్ష్మిపతి యాదయ్య సురేందర్ లక్ష్మణ్ రాములు బసవరాజ్ సురేష్ యాదయ్య అరుణ్ సంజీవ మహేందర్ యాదగిరి నవీన్ నరేష్ రాజు లింగం పెంటయ్య హరి నరసింహ మహేందర్ దినేష్ ఫోటోగ్రాఫర్లు పాల్గొనడం జరిగింది.

## ఘనంగా అంతర్జాతీయ గిరిజన దినోత్సవం



సంగారెడ్డి, ప్రజా పాలన ప్రతినిధి: విద్యాభ్యాసం మనలో మార్పు తెస్తుందని గిరిజనులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ అన్నారు. సంగారెడ్డి పట్టణంలో ఉమ్మడి మెదక్ జిల్లా గిరిజన సంక్షేమ, విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ గిరిజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఐ బి నుండి జడ్పి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా ప్రజా పరిషత్ లో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తండాలను గ్రామపంచాయతీలుగా చేయడం సీఎం కేసీఆర్ వల్లనే సాధ్యమైందని తెలిపారు. దీంతో మన పరిపాలన మనం చేసుకునే వెసలుబాటు కలిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడిమెదక్ జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హరికిషన్, జడ్పిటిసి రాజు రాథోడ్, ఉద్యోగ సంఘం నాయకులు, మాంజ్య నాయక్, సుభాన్ సింగ్, వైద్యనాథ్, వేణుగోపాల్, భోజ్ రాజ్, నందు సింగ్, మోహన్ సింగ్, శంకర్ నాయక్, గాయకులు బిక్షు నాయక్, ఎస్పీ నాయక్, కవిరాం, అశోక్, సురేష్, తారా సింగ్, జైపాల్ నాయక్, రాజేందర్ నాయక్, ఫుల్ సింగ్, రమేష్, శివాజీ, రాజు, శంకర్ నాయక్, ప్రకాష్ నాయక్, ఎరుకల సంఘం నాయకులు గోపాల్, దినేష్, జితేందర్, నారాయణ సురేందర్, రవి, గణపతి, రగ్య, కిషన్, రంజిత్, దేవిసింగ్, సంతోష్, శ్రీనివాస్, సూరి, సత్య మూర్తి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు పరుశురాం, రవి, హిరాలాల్, టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జలెందర్, లా స్టూడెంట్స్, ఎస్టి కాలేజ్ హాస్టల్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ సుబ్రమణ్య స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తనయుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి



తిరుపతి జిల్లా, పాకాల మండలం, (ప్రజాపాలన న్యూస్): 75వ ఆడికృత్తిక మహోత్సవం సందర్భం.. పాకాల మండలం ఊట్లవారిపల్లి ఆనందగిరి క్షేత్రంలో కొలువుదీరిన శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్య స్వామి వారికి బుధవారం పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తనయుడు, 2024 ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి. పూర్ణకుంభ స్వాగతం పలికిన ఆలయ అర్చకులు. పాలకమండలి సభ్యులు, పట్టువస్త్రాలతో ఊరేగింపుగా మెట్ల మార్గం గుండా ఆలయానికి చేరుకున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులకు పట్టు వస్త్రాలు, పండ్లు, పూలు, పూల మాలలు, కొబ్బరికాయలు తదితర పూజా సామాగ్రిని అందజేసిన మోహిత్ రెడ్డి. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం వేద ఆశీర్వచనం చేసిన వేద పండితులు. మోహిత్ రెడ్డిని ఘనంగా సన్మానించిన పాలకమండలి ఛైర్మెన్, సభ్యులు, అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసారు. ఆలయ అవరణలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి, భక్తులకు వడ్డించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, ఏటా ఆలయ పాలకమండలి, సిబ్బందికి ఆడికృత్తిక సందర్భంగా దుస్తులు అందిచడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడు కూడా దుస్తులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి. ఆడికృత్తిక బ్రహ్మోత్సవ సందర్భంగా ఆలయ పరిసరాల్లో చేపట్టిన ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి. ఆలయం వద్ద భక్తుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి. బీపీ పరీక్షలు చేయించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ పాలకమండలి, పోలీస్, వివిధ శాఖలకు సూచించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ మహాసముద్రం పట్టాభి రెడ్డి, సభ్యులు ఎం యోగానంద ఆచారి, జే బాబు రెడ్డి, ఈ లోకనాథం, టి రేవతి, పి మాధవి, జి మమత, హెచ్ఎం కృష్ణమూర్తి శర్మ ఎక్స్ అఫీషియో సభ్యులు, జెడ్పిటిసి నంగా పద్మజా రెడ్డి, , ఊట్లవారిపల్లి సర్పంచ్ గౌరీ శంకర్ రాజు, పాకాల మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షులు నరేష్ రెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షులు మరియు ఎంపీటీసీలు సర్పంచులు వివిధ విభాగాల అధికారులు నాయకులు పాల్గొన్నారు.

## మీరు ఇబ్బందీ పడవద్దు....ప్రజలను ఇబ్బందీ పెట్టవద్దు..



పల్నాడు జిల్లా .నరసరావుపేట . ఆగస్టు 9 (ప్రజాపాలన ప్రతినిధి.): మీరు ఇబ్బంది పడవద్దు ప్రజల ఇబ్బంది పెట్టొద్దని నరసరావుపేట డిఎస్పి కేవీ మహేష్ అన్నారు.స్థానిక అర్.టి.సి బస్ స్టాండ్ వద్ద మార్కెట్ యార్డ్ కు సంబంధించిన దుకాణదారులను లబ్ది లబ్ధిదారులతో డిఎస్పి మాట్లాడారు. ఈ సందర్భంగా డిఎస్పి మహేష్ మాట్లాడుతూ అక్రమ నిర్మాణాల వల్ల ప్రజలు చాలా ఇబ్బందీ పడుతున్నార ని , మీకు ప్రభుత్వం మంజూరు చేసిన దుకాణాల కంటే కూడా చాలా ముందుకు వచ్చారు.టౌన్ ప్లానింగ్ అదికారులు ఇచ్చిన సమాచరం తో మాత్రమే మేము అక్రమ నిర్మాణాలు తీసి వేస్తున్నామని తెలిపారు.నరసరావుపేట జిల్లా అయ్యింది కాబట్టి రోడ్డులు కూడా దానికి తగ్గటుగానే ఉండాలి, మీరు దుకాణాలు రోడ్డు పై తేవటం వల్ల ట్రాఫిక్ సమస్య కూడా ఎక్కువ అవుతుందని ,గతం లో మార్కెట్ సెంటర్ లో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉండేది.పోలీస్ వారు తీసుకున్న కొన్ని నిర్ణయల వల్ల అక్కడ ట్రాఫిక్ సమస్య పూర్తిగా తగ్గిపోయిందని అన్నారు.ఇప్పుడు అయిన మీ స్థలం లో మీ దుకాణాలు ఏర్పాటు చేసుకొని చక్కగ వ్యాపారాలు చేసుకోండి.రోడ్డు పైకి వచ్చి మీరు ఇబ్బందీ పడవద్దు.ప్రజలను ఇబ్బందీ పెట్టవద్దు. రెండవ పట్టణ సిఐ వీరేంద్రలి అద్వరయం లో అక్రమ నిర్మాణాలు తొలగిస్తున్నారు.

# మల్లవరంలో మహాశక్తి ప్రచార రథయాత్ర



గోకవరం ఆగస్టు.9 ప్రజా పాలన: గోకవరం మండలం మల్లవరం గ్రామంలో మహాశక్తి రథయాత్ర ప్రారంభించిన రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ, గ్రామంలో మహిళలతో గ్రామమంతా పర్యటించి చంద్రబాబు ప్రకటించిన భవిష్యత్తు గ్యారంటీ, మహ శక్తి పథకాలను ప్రజలకు వివరిస్తూ గ్రామంలో ఇంటింటికి పర్యటించారు. మహిళా శక్తి తోనే రాష్ట్ర రాజకీయాలలో పెనుమార్పు రాబోతుందని తెలుగుదేశం పార్టీ ప్రభంజనం సృష్టించబోతుందని నెహ్రూ అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా నాయకురాళ్లు ఇంటి ఇంటికి తిరుగుతూ మహాశక్తి పథకాల కరపత్రాలను పంచుతూ రాష్ట్రానికి తెలుగుదేశం ప్రభుత్వ ఆవశ్యకతను తెలియజేసినారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం తోనే మహిళా సాధికారత సాధ్యం అయిందని అన్నారు. తెలుగుదేశ ప్రభుత్వం మహిళలకు రక్షణ కవచంలా పనిచేసేదని కానీ ఈనాడు మహిళలు బయటకు వచ్చి స్వతంత్రంగా తిరిగే పరిస్థితి లేదని అన్నారు. అన్నీ విధాల మహిళలకు భారంగా మారిన వైసిపి ప్రభుత్వ అధికార పీఠాన్ని కదలగొట్టగల శక్తి మహిళలకు మాత్రమే ఉందని నెహ్రూ అన్నారు. మన సొంత కుటుంబాన్ని ఆర్థికంగా బలపరచడానికి మహిళ ఎంత శ్రమ పడుతుందో, అదేవిధంగా విచ్ఛిన్నం అయిపోయిన రాష్ట్ర భవిష్యత్తు ను కాపాడి రాష్ట్రాన్ని ముందుకు నడిపించడానికి మహిళా శక్తి కృషి చెయ్యాలని జ్యోతుల నెహ్రూ అన్నారు. ప్రజలు మిమ్మల్ని నమ్మి ఓట్లు వేసిన పాపానికి మీరు అభివృద్ధి చేయకపోగా, గత అభివృద్ధి ని ఈ ప్రభుత్వం నాశనం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఈడుదల లక్ష్మీ అర్జునరావు, కోట సత్యవతి, నకిరెడ్డి సూర్యవతి, గుమ్మల్ల అనంతలక్ష్మి, పోలినాటి.ధర్మానందకుమారి, రాపాక లక్ష్మి, యల్లాటి అమ్మాజీ, గెద్దాడ సత్యవేణి, గొల్లపల్లి శ్రీదేవి, చెక్క మరియా, గుండుపల్లి సుజాత, తిప్పన సత్యవతి, గొల్లవిల్లి వరలక్ష్మీ మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అచ్యుతాపురంలో నా భూమి.. నా దేశం కార్యక్రమం ప్రారంభం ఎంపీపీ సుంకర..



గోకవరం ఆగస్టు 9 ప్రజా పాలన: స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన ఆజాదీగా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని మండలంలోని ప్రతీ పంచాయతీలో జయప్రదం చేయాలని గోకవరం ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు అన్నారు. గోకవరం మండలం అచ్యుతాపురం గ్రామంలో ఆజాదీగా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నా భూమి, నా దేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమన్ని శిలాఫలకం ఆవిష్కరించి ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో కొబ్బరి మొక్కలు నాటారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీపీ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా ప్రతీ గ్రామం నుంచి మట్టిని సేకరించి ఢిల్లీకి పంపించడం జరుగుతుందన్నారు. ప్రతీ గ్రామంలో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని, దీనికి ఆయా గ్రామాల సర్పంచ్లు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు సుంకర వీరబాబు, ఎంపీడీఓ కె.పద్మాజ్యోతి, ఈఓపీఆర్డీ రాజేశ్వరరావు, సర్పంచ్ బత్తుల శ్రీను, ఏపీఓ అప్పలరాజు, నాయకులు తోలేటి రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# తిన్నరేవును, చేసిన సేవను మరువొద్దు : మంత్రి హరీశ్‌రావు

(మొదటి పేజీ తరువాయి)

చదువుకుంటున్న విద్యార్థులు మీ పేరెంట్స్‌కు తెలపాలని సూచించారు. 2014 కు ముందు రెసిడెన్షియల్ విద్యపై పెట్టిన ఖర్చు రూ.970 కోట్లు, నేడు రూ.4000 కోట్లు ఖర్చు పెడుతున్నామని స్పష్టం చేశారు. రెండు, మూడు రోజుల్లో బీసీ రెసిడెన్షియల్ స్కూల్ కూడా ఏర్పాటు చేసుకోబోతున్నాం.ప్రభుత్వం పని ఎక్కువ చేస్తున్నది, చెప్పుకునేది తక్కువ ఉన్నదని పేర్కొన్నారు. ఒకప్పుడు పంజాబ్ వరి ధాన్యంలో మొదటి స్థానంలో ఉంటే నేడు తెలంగాణ నెంబర్ వన్‌గా మారిందని గుర్తు చేశారు. చంద్రబాబుకు ఎప్పుడూ మనమీద ప్రేమ ఉండదు కానీ, మొన్న చంద్రబాబు తెలంగాణ భూములపై పాజిటివ్‌గా మాట్లాడారు. ఒకప్పుడు ఆంధ్రలో ఎకరం భూమి అమ్ముకుంటే తెలంగాణలో ఐదు ఎకరాలు దొరికేది, నేడు తెలంగాణలో ఎకరం అమ్మితే ఆంధ్రలో ఐదు ఎకరాలు దొరికే పరిస్థితి వచ్చిందని చంద్రబాబు అన్నారు. తెలంగాణలో కైకిలు లేని రోజుల నుంచి, నేడు కైకిలోల్లు దొరకని పరిస్తితి వచ్చిందని తెలిపారు. నిజాలు ప్రజలకు తెలియాలి. ఇంత మంచి ప్రభుత్వాన్ని.. చేసిన సేవలను గుర్తించి మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్, బీజేపోళ్లకు ఢిల్లీలో బాసులు ఉన్నారు

(మొదటి పేజీ తరువాయి)

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ఆలోచనకు రాగానే అమలు చేసి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక సాయం చేశారు. కేసీఆర్ కిట్లు అందుతున్నాయి. 24 గంటల కరెంట్ ఇవ్వాలని ఆలోచన రాగానే వెంటనే అమలు చేశారు. అదే ఈ ఢిల్లీ పార్టీలకు అవకాశం ఇస్తే ఏమైతదో ఆలోచన చేయండని కేటీఆర్ సూచించారు.

**నలుగురు ఒక దగ్గర కూర్చోలేరు కానీ.. కేసీఆర్‌ను ఓడిస్తారటా..**

బీజేపోడు, కాంగ్రెసోడు నిలబడాలంటే, కూర్చోవాలంటే ఢిల్లీకి పోవాలి అని కేటీఆర్ పేర్కొన్నారు. వాళ్లు ఒక్క హామీ ఇవ్వాలన్నా.. దాన్ని అమలు చేయాలన్నా ఢిల్లీకి పోవాలి. వాళ్లు నోరు తెరవాలంటే.. తెరిచిన నోరు మూయాలంటే కూడా ఢిల్లీకి పోవాలి. ఎన్నికల్లో సీటు కావాలంటే ఢిల్లీ పోవాలి. గాంధీ భవన్ గేటు దాటాలంటే ఢిల్లీ పోవాలి. ఒక రోడ్డు వేయాలంటే ఢిల్లీకి పోవాలి. అదే రోడ్డు మీద కాంగ్రెసోళ్లు, బీజేపోళ్లు తన్నుకుంటే,ఆ పంచాయితీ కూడా ఢిల్లీకి పోవాలి. చివరకు కూర్చోవాలన్నా ఢిల్లీ.. నిల్చోవాలన్నా ఢిల్లీ పోవాలి. ఆఖరికి ఉచ్చ పోయాలన్నా ఢిల్లీకి పోవాలి. ఈ గబ్బుగాళ్లు నలుగురు ఒక దగ్గర కూర్చోలేరు కానీ.. ఇవాళ కేసీఆర్‌ను ఓడగొట్టి, ఏదో పీకి పందిరి వేస్తామని చెప్పి మళ్లా లొల్లి పెడుతున్నారు. ఢిల్లీ బానిసలైనా కాంగ్రెస్, బీజేపీ.. తెలంగాణ ఆత్మగౌరవానికి మధ్య జరుగుతున్న పోటీ ఈ రాబోయే ఎన్నిక. పౌరుషం ఉన్న తెలంగాణ బిడ్డలు ఈ ఢిల్లీ గద్దలను తరిమికొట్టాలి అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# రంగం సిద్ధం..

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైనటువంటివారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని సూచించారు. మరో విషయం ఏంటంటే డిమాండ్ ఉన్న యూనిట్లను ఎంపిక చేసుకునే విధంగా దళిత బంధు కోసం ఎంపికైన లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. మొదటి విడుతలో అందజేసినటువంటి నిర్వహణ.. వారు పొందిన ప్రయోజనాలపై వీడియో, ఫోటో రూపంలో నివేదికలు అందజేయాలని చెప్పారు. కొనుగోలు చేసిన వాహనాలకు దళితబంధు పథకం స్టిక్కర్లు తొలగిస్తున్నారని.. వాటిని తొలగించకుండా చూడాలని కొంతమంది ఎమ్మెల్యేలు సమావేశంలో మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వాహనాలపై స్టిక్కర్లు తొలగించకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి తలసాని ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ సమావేశంలో ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, రహ్మత్ బేగ్ పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



**మహా బోధి స్కూల్ గ్రౌండు భూదేవి నగర్ సికింద్రాబాద్ లో గద్దర్ సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న బీసీ కమిషన్ మాజీ చైర్మెన్ బి ఎస్ రాములు , రిటైర్డు డీఈ గంగారెడ్డి, ప్రముఖ కవి గాయకుడు అంబటి వెంకన్న.**

## రోడ్డు ప్రమాదంలో అన్నారుగూడెం యువకుడు దుర్మరణం..



తల్లాడ, ఆగస్టు 9 (ప్రజా పాలన న్యూస్): తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. గ్రామానికి చెందిన రామిశెట్టి నాగార్జున (30) తన ద్విచక్ర వాహనంపై వైరా వైపు నుండి తల్లాడవు వస్తుండగా స్టేజీ పినపాకు వద్ద పెట్రోల్ బంక్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నాగార్జున ఆటో డ్రైవర్ తో పాటు ఇంటిదగ్గర పొద్దున్నే టిఫిన్ ఏర్పాటు చేస్తుంటారు. అందరితో కలివిడిగా ఉంటూ ఒక్కసారిగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. దీంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

## గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న నవీన్ కుమార్ రెడ్డి ని పరామర్శించిన జెడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డి



ప్రజాపాలన ప్రతినిధి షాబాద్: ఇటీవల అస్వస్థత గురై నీమ్స్ లో చికిత్స పొందుతున్న నవీన్ కుమార్ రెడ్డిని షాబాద్ జెడ్పిటీసీ పట్నం అవినాష్ రెడ్డి పరామర్శించారు. మండలంలోని మన్మరి గ్రామానికి చెందిన టిఆర్ఎస్ నాయకుడు, సహకార సంఘం మాజీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి కుమారుడు నవీన్ కుమార్ రెడ్డి గత కొద్ది రోజులుగా గుండెకు సంబంధించిన వ్యాధితో సతమతమవుతూ వారం రోజులుగా నీమ్స్ లో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో విషయం చేసిన అవినాష్ రెడ్డి నీమ్స్ కు చేరుకొని నవీన్ కుమార్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని గురించి తెలుసుకున్నారు. అనంతరం మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. నవీన్ ఆరోగ్యం మెరుగుపరిచేందుకు అవసరమైన సహకారం అందిస్తామని అవినాష్ రెడ్డి తెలిపారు.

## రత్నకుమార్ అంత్యక్రియల్లో పాల్గొన్న మానవతారాయ్



తల్లాడ, ఆగస్టు 9 (ప్రజా పాలన న్యూస్):సత్తుపల్లి మండలం కిష్టాపురం గ్రామంలో నిన్న మృతి చెందిన బొబ్బిలి రత్నకుమార్ అంతిమయాత్రలో బుధవారం సాయంత్రం టి పి సి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతరాయ్ పాల్గొని రత్నకుమార్ భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రలో బొబ్బిలి రత్నకుమార్ శవపేటికను మానవతారాయ్ బొందల గడ్డ వరకు మోసారు. ఈ కార్యక్రమంలో బూరుగు వెంకటేశ్వర్లు, ఐ క్రిష్ణ,ఏడుకొండలు, రంగయ్య, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## బీసీలు అందరికి లబ్ధి అందాలు: సిఎల్పీ నేత భట్టి విక్రమార్క



మధిర ఆగస్టు 9 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో స్థానిక వర్తక సంఘం కళ్యాణ్ మండపంలో ఏర్పాటు చేసిన బీసీ బందు చెక్కుల పంపిణీ కార్యక్రమానికి సీఎల్పీ బట్టి విక్రమార్క పాల్గొని బీసీ లందరికీ లబ్ధి అందాలని వారు పేర్కొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే బట్టి విక్రమార్క మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం బీసీలకు సమన్వయం జరగట్లేదని బీసీలు పట్ల ప్రభుత్వం లబ్ధి పొందాలని కానీ బీసీలు అందరికీ లబ్ధి జరగాలని అదేవిధంగా మీకు ఇచ్చే ఈ సొమ్ము ఎవరి ఇంట్లోధి కాదు ఇది ప్రజల సొమ్ము.జనాభా లో సగం భాగం ఉన్న బీసీ లకు రాష్ట్ర బడ్జెట్ లో సగం నిధులు కేటాయించాలిబిసి లో అందరికీ లబ్ధి అందాలి.ఇది ఎవరి దయా దక్షిణ్యాలు కానే కాదు.ఈ సొమ్ముతో మీరు మంచి వ్యాపారాలు చేసి వృద్ధిలోకి రావాలిరాష్ట్రం లో బీసీ సబ్ ప్లాన్ తీసుకురావడానికి కృషి చేస్తాబిసి కార్పొరేషన్ ద్వారా రావాల్సిన నిధులు గత కొన్నేలుగా రావడం లేదు... ఇలాంటి వాటిని వారికి అందేలా ప్రభుత్వానికి లేఖ వ్రాస్తాను.నియోజవర్గంకి 300 వందలు అంటే అందరికీ అందడానికి ఎప్పటికీ అవుతుంది.అందుకే బిసి సబ్ ప్లాన్ తీసుకొచ్చే విధంగా రానున్న రోజుల్లో ప్రయత్నం చేస్తాం..కొందరికే లబ్ధి చేకూరుతే అందరూ అభివృద్ధిలోకి రావడం జరగదు...అందుకు అందరికీ లబ్ధి జరిగేలా చూడాలి.సమాజం లో ప్రతి ఒక్కరూ కలిసి లబ్ధిదారులు వ్యాపారాల ద్వారా అభివృద్ధిలోకి వచ్చేలా ప్రయత్నం చేద్దాం. వారు తెలిపారు ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు లబ్ధిదారులు పాల్గొన్నారు

## ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి: జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



మంచిర్యాల బ్యూరో, ఆగస్టు 9, ప్రజాపాలన :ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ఆదివాసీలు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా గిరిజన అభిశృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలలో జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి నీలిమ, ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి జిల్లా కేంద్రంలోని ఐ.బి. చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం ఐ.బి. చౌరస్తా నుండి బైపాస్ రోడ్డులోని హరిత ఫంక్షన్హాల్ వరకు ఆదివాసీ సంప్రదాయ గుస్సాడీ నృత్యాలతో చేపట్టిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ భావితరాలకు అందించే విధంగా ఆదివాసీ నాయకులు, పెద్దలు కృషి చేయాలని తెలిపారు. ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందని, ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. పోడు వ్యవసాయం సాగు చేస్తున్న అర్హులైన ఆదివాసీలు, గిరిజనులకు ఆర్.ఓ.ఎఫ్.ఆర్. చట్టం-2005 నిబంధనల మేరకు పోడు పట్టాలు పంపిణీ చేసి వారు సాగు చేసుకుంటున్న భూములపై సర్వ హక్కులు కల్పించడం జరిగిందని తెలిపారు. ఆదివాసి ప్రజల జీవన విధానంలో అనేక మార్పులు తీసుకురావడం జరిగిందని, ఆదివాసి విద్యార్థులకు నాణ్యమైన విద్య, ప్రజలకు మెరుగైన వైద్య సేవలతో పాటు గిరి గూడాలలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించడం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అనేక ఆదివాసి గ్రామాలకు రహదారులు, వంతెనల నిర్మాణాలు చేపట్టి ప్రపంచానికి చేరువ చేసి గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటుందని, ప్రజల సౌకర్యార్థం మౌళిక వసతులు కల్పించిందని తెలిపారు. గిరి వికాసం పథకం ద్వారా ఆదివాసీల వ్యవసాయ కమతాలలో బోర్వెల్ ఏర్పాట్లు, జలప్రభ పథకం ద్వారా సాగునీటి సరఫరాతో పాటు అనేక అభివృద్ధి పథకాలను చేపట్టి విజయవంతంగా అమలు చేస్తూ ఆదివాసీ ప్రజల జీవన విధానంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ పర్ధాన్ సంఘం నాయకులు, ఆదివాసీ సంఘాల నాయకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైన్ షాపుల కొరకు అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి: జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



మంచిర్యాల బ్యూరో, ఆగస్టు 9, ప్రజాపాలన : జిల్లాలో వైన్షాపులు ఏర్పాటు కొరకు ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ నిబంధనల మేరకు అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అర్హత గల వాటిని పరిగణలోకి తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా మద్యనిషేద, ఆబ్కారీ శాఖ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి జిల్లా మద్యనిషేధ, ఆబ్కారీ శాఖ అధికారి నందగోపాల్తో కలిసి మద్యం షాపుల కేటాయింపు కొరకు చేపట్టిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వైన్షాపులు కేటాయించేందుకు జిల్లాలోని 73 ఎ-4 మద్యం షాపులకు డిసెంబర్ 1, 2023 నుండి నవంబర్ 30, 2025 వరకు 2023-25 సంవత్సరానికి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, జిల్లాలో స్లాబ్ 50 లక్షలలో 17 ఎ-4 మద్యం షాపులు, స్లాబ్ 55 లక్షలలో 17 ఎ-4 మద్యం షాపులు, స్లాబ్ 60 లక్షలలో 38 ఎ-4 మద్యం షాపులు, స్లాబ్ 65 లక్షలలో 1 ఎ-4 మద్యం షాపు ఉన్నాయని, వీటిలో షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ కేటగిరిలో 10 ఎ-4 మద్యం షాపులు, షెడ్యూల్ తెగల రిజర్వేషన్లో 6 ఎ-4 మద్యం షాపులు, గౌడ కులస్తుల రిజర్వేషన్లో 6 ఎ-4 మద్యం షాపులు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ నెల 18వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని జన్మభూమి నగర్లో గల జిల్లా మద్య నిషేధ, ఆబ్కారీ అధికారి కార్యాలయంలో / హైదరాబాద్లోని నాంపల్లిలో గల కమీషనర్ ప్రొహిబిషన్ %డ% ఎక్సైజ్ కార్యాలయంలో ఉదయం 11 గం?ల నుండి సాయంత్రం 5 గం౹ల వరకు (ఈ నెల 6, 13, 15 తేదీలు మినహాయించి) దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 21వ తేదీన జిల్లా కేంద్రంలోని గోదావరిరోడ్లో గల పద్మనాయక కళ్యాణ మండపంలో లాటరీ పద్ధతిన ఎంపిక చేయడం జరుగుతుందని, దరఖాస్తు కొరకు ధరావత్తు లేదని, దరఖాస్తు రుసుము 2 లక్షల రూపాయలు చలాన్ / డి.డి. District Prohibition & Excise Officer, Mancherial పేరిట చెల్లించాలని, లైసెన్సీ రుసుము 6 వాయిదాల పద్దతిలో చెల్లించాలని, దరఖాస్తుతో పాటు 3 పాస్పోర్ట్ సైజ్ ఫొటోలు, సంతకం చేయబడిన పాన్ కార్డు, ఆధార్కార్డు, కులధృవీకరణ పత్రం ప్రతులు / ఏజెన్సీ ప్రాంతాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా జారీ చేయబడిన ఏజెన్సీ స్థానిక నివాస ధృవీకరణ పత్రం సమర్పించవలసి ఉ ంటుందని, దరఖాస్తు సమర్పించే సమయంలో కుల ధృవీకరణ పత్రం గౌడ్/ఎస్.సి./ఎస్.టి. లేనిచో అఫిడవిట్ పత్రము సమర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సి.ఐ. నరేందర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు నశించాలి: వామపక్ష కార్మిక సంఘాలు



మంచిర్యాల టౌన్, ఆగష్టు 09, ప్రజాపాలన: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు నశించలని వామపక్ష కార్మిక సంఘాల నాయకులు అన్నారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా ప్రజా కార్మిక వ్యతిరేక పరిపాలన సాగిస్తూ జాతీయ సహజ వనరులు ప్రభుత్వ రంగ సంస్థలను స్వదేశీ విదేశీ కార్పొరేట్ కంపెనీలు అమ్ముతుందని మండిపడ్డారు. కేంద్ర బిజెపి విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు ప్రజలు విద్యార్థులు మేధావులు ప్రజాసంఘాల నాయకులు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కలందర్ ఖాన్ దుంపల రంజిత్ కుమార్ మేకల రామన్న తోకల తిరుపతి జాడి దేవ రాజ్ గోమస ప్రకాష్ అరుణ శ్రీనివాస్ దేవయ్య ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్కే ఫౌండేషన్ అనాధ ఆశ్రమంలో అన్నదానం



మధిర ఆగస్టు 9 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో ఆర్కే ఫౌండేషన్ లో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం జరుగుతుందని ఆర్కే ఫౌండేషన్ రామకృష్ణ తెలిపారు.ఈరోజుచిన్నారి అద్దంకి ఆరాధ్య ప్రజ్వల్ పుట్టినరోజు సందర్భంగా ఆర్కే ఫౌండేషన్ అనాధ ఆశ్రమంలో మహెూన్నతమైన అన్నదానం నిర్వహించారు వారి అన్నయ్య అద్దంకి ఆశిష్ ప్రజ్వల్.. ఆర్కే ఫౌండేషన్ అనాధ ఆశ్రమం ఫ్యామిలీ సభ్యుడుగా ఎల్లప్పుడూ తోడుగా ఉంటూ అనాధ ఆశ్రమానికి సహాయ సహకారాలు అందిస్తున్న . జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు లిశ్రీ అద్దంకి రవికుమార్ నిర్మల జ్యోతి గారాలపట్టి ఆరాధ్య ప్రజ్వల్ పుట్టినరోజు సందర్భంగాలి అన్నదానం నిర్వహించిన వారి అన్నయ్య ఆశిష్ ప్రజ్వల్ కు మరియు వారి కుటుంబ సభ్యులకు ఆర్కే ఫౌండేషన్ అనాధ ఆశ్రమం నిర్వాహకులు దోర్నాల జ్యోతి రామకృష్ణ కృతజ్ఞతలు తెలియజేశారు..

## తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బాదావత్ గంగు ఎన్నిక



బోనకల్,ఆగస్టు 9 ప్రజా పాలన ప్రతినిధి:తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బోనకల్ ఎస్టీ కాలనీవాసి బాధావత్ గంగు ఎన్నికయ్యారు. బుధవారం హైదరాబాద్ ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్లో ప్రమాణస్వీకారం చేశారు.జాతీయ కార్యదర్శి కాసాని వీరేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా గంగు మాట్లాడుతూ ఈ పదవిని నాకు కల్పించిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ పార్టీ కార్యదర్శి నారాలోకేష్, తెలంగాణా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర పార్టీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వరి ముదిరాజు, ఖమ్మం పార్లమెంటరీ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, బోనకల్ మండల కన్వీనర్ రావుట్ల సత్యనారాయణ,జిల్లా నాయకులు నందమూరి సత్యనారాయణ, సాధినేని హనుమంతరావు, మైనేని రవికుమార్ లకు బోనకల్ మండల కమిటీ సభ్యులకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఇక ముందు పార్టీ కోసం, పార్టీ అభివృద్ధి కోసం పూర్తి స్థాయిలో పని చేస్తానని, రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం తన వంతు సహకారం పార్టీకి అందిస్తానని బాధావత్ గాంగ్ తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎన్నికైనందుకు బోనకల్ మండల తెలుగుదేశం పార్టీ నాయకులు బాదావత్ గంగు కు అభినందనలు తెలిపారు.



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

**సంపాదకీయం**

గురువారం 10, ఆగష్టు 2023

# అభివృద్ధికి 'కోకాపేట' కొలమానమా?

కూడు,గూడు, గుడ్డ మానవాళి కనీస మౌలిక అవసరాలు. మనిషి సగటు జీవితం వీటి చుట్టూ కేంద్రీకృతమై ఉంటుంది. ఆ అవసరాలను సంతృప్తికరంగా తీర్చుకోవడానికై మనిషి సప్త సముద్రాలను కూడా దాటుతాడు. తెలుగునాట ఒకప్పుడు స్థిరాస్థుల కొనుగోలుదారులలో, ఇలా దేశాంతరాలు వెళ్లి ఉద్యోగాలు చేసే వారే అగ్రగణ్యులు. అటు కడప జిల్లా రాజంపేట నుంచి ఇటు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, అటు తూర్పు గోదావరి జిల్లా రాజోలు వరకు హైదరాబాద్ మహానగరంలోనూ, ఇతర నగరాలలోనూ స్థిరాస్థుల లావాదేవీలలో ఈ సిరిమంతులే ముందుండే వారు. కాలక్రమేణ రాజకీయ నాయకులు ఈ స్థిరాస్థుల రంగంలో ప్రవేశించిన తర్వాత ప్రవాసులు వెనుకబడ్డారు. గతంలో ఒక నాలుగు సంవత్సరాలు విదేశాలలో పని చేస్తే హైదరాబాద్ నగరంలో సునాయాసంగా ఒక ఇంటికి యాజమాని అయ్యే పరిస్థితి ఉండేది. ఇప్పుడు అది గతకాలం ముచ్చట అయిపోయింది. ఇటీవల హైదరాబాద్‌లోని కోకాపేట భూములకు రికార్డు స్థాయిలో ధర పలుకడం ఇంటా బయటా చర్చనీయాంశమయింది. సుదూర దేశాలలో కూడా నలుగురు తెలుగువారు కలిస్తే కోకాపేట భూముల విషయం గురించే మాట్లాడుకుంటున్నారంటే సత్య దూరం కాదు. ఒకప్పుడు కొంత కాలం పని చేసి పొదుపు చేసుకుంటే హైదరాబాద్ నగరంలో ఒక చిన్నపాటి ఇల్లును స్వంతం చేసుకోవాలనే స్వప్నం సాకారమయ్యేది. ఇక విదేశాలలో కొంత కాలం పని చేస్తే సునాయాసంగా ఒక విశాల గృహానికి యాజమాని అయ్యే అవకాశం దక్కేది. ఒక రకంగా చెప్పాలంటే కుటుంబ అవసరాలు, ప్రత్యేకించి స్వంత ఇల్లు అనే ఒక లక్ష్య సాధనకు ప్రవాస బాటను ఎంచుకున్న తెలుగువారు అసంఖ్యాకం. రాజకీయ, అధికార వ్యవస్థలలోని కొందరు సమష్టిగా భూ లావాదేవీలకు శ్రీకారం చుట్టిన తర్వాత స్థిరాస్థుల రంగంలో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఆ పరిణామం ప్రస్తుతం పరాకాష్ఠకు చేరుకున్నది. నాయకులు, కొందరు అధికారులు ప్రమోటర్లుగా ఉన్నా ఇప్పటికీ ప్రవాసులు లేదా స్వదేశాన ఉండి విదేశీ సంస్థలలో పని చేస్తున్న ఉద్యోగులు ముఖ్యంగా ఐ.టి. రంగం వారు స్థిరాస్థుల కొనుగోళ్ళలో ముఖ్య భూమిక వహిస్తున్నారు. హైదరాబాద్ నగర చుట్టుప్రక్కల భూముల ధరలను పాలకవర్గాల అస్మదీయులు ఒక పథకం ప్రకారం కృత్రిమంగా హెచ్చిస్తూ వస్తున్నారు. నగరం నలుదిక్కుల యాదాద్రి, ఫార్మా సిటీ, ఔటర్ రింగు రోడ్డు ఇత్యాది ప్రతిష్ఠాత్మక పథకాలతో అసలు లబ్ధిదారుల కంటే ఎక్కువగా ఈ అస్మదీయులే ప్రయోజనం పొందారనేది ఒక చేదు నిజం. ఈ నేపథ్యంలో కోకాపేటలో ఒక ఎకరం భూమికి రూ.100 కోట్ల ధర పలికింది. అనూహ్యమైన ఈ ధరను హైదరాబాద్ నగర అభివృద్ధికి తిరుగులేని ప్రమాణంగా భావిస్తున్నారు. దేశంలోను, విదేశాలలోను ఈ వ్యాపార పరిణామంపై విశేష ప్రచారం మొదలయింది. ఆకాశాన్ని అంటిన ఈ భూముల ధర పురోగమనానికి సంకేతమా లేదా గుత్తాధిపత్యానికి సూచకమా? ఈ ప్రశ్నకు సమాధానం వ్యక్తుల ఆలోచనా దృక్పథంపై ఆధారపడి ఉంటుంది. రూ. 100 కోట్లకు ఒక ఎకరం అంటే సుమారు 4047 చదరపు అడుగుల స్థలంలో ఎన్ని ఆకాశ హర్మ్యాలను, ఎన్ని ఫ్లాట్లను నిర్మిస్తారు? నిర్మాణ వ్యయం, రుణాలపై వడ్డీ, ఒక్కొక్కరికి ఎన్ని గజాల నికర స్థలం వస్తుంది? మొదలైన అంశాలను పరిగణనలోకి తీసుకుంటే కలవరం చెందకుండా ఉండలేము. ఆదాయ వనరులు బాగా ఉన్నవారు సైతం ఈ రకమైన ప్రదేశాలలో ఇళ్ళను కొనుగోలు చేయడం అంత సులభతరం కాదు. ఎంత మంది ఈ రకమైన గేటెడ్ కమ్యూనిటీలలో నివాసాలను ఏర్పాటు చేసుకోగలరు? డబుల్ బెడ్ రూం ఇళ్ళు మంజూరయితే మహాభాగ్యమనుకునే అభాగ్యులు అసంఖ్యాకంగా ఉన్న రాష్ట్రంలో ఆర్థికాభ్యుదయానికి కోకాపేట కొలమానం కాకూడదు. హైదరాబాద్ నగరం చుట్టు ప్రక్కల భూముల ధరలపై స్థానికంగా ఉన్న సామాన్య రైతుల కంటే ఎక్కువగా విదేశాలలో ఉంటున్న ప్రవాసులలో అధిక ఆసక్తి వ్యక్తమవుతుండడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?ఏడో నిజాం నవాబును నిరంకుశ పాలకుడని భావిస్తారు. అయితే హైదరాబాద్ నగరంలోని పేదలందరికీ ఆయన ఉచిత గృహ వసతి కల్పించిన విషయాన్ని మాత్రం విస్మరిస్తున్నారు. ప్రత్యేక హౌజింగ్ బోర్డు ద్వారా నగరంలోని నాంపల్లి, ఖైరతాబాద్, బాగ్ లింగంపల్లి వివిధ ఇతర ప్రాంతాలలో అల్పాదాయ వర్గాల (యల్.ఐ.జి) వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వడం జరిగింది. అదే విధంగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఉపాధి కొరకు అలనాటి బొంబాయి మహానగరానికి వలస పోయిన శ్రామిక జనులకు వర్లీ, పరేల్ ప్రాంతాలలో బ్రిటిష్ పాలకులు సైతం ఉచిత గృహ వసతి కల్పించారు. పేదల ఇళ్లపై బ్రిటిష్ వలస పాలకులు, నిజాం నవాబు చూపిన శ్రద్ధలో కనీసం కొంచెమైనా ప్రస్తుత ప్రభుత్వాలు చూపడం లేదు. 'అయె మౌత్ తునే ముజ్కో జమీందార్ కర్దియా, దో గజ్ క్యా నహీ మేరి మిల్కియత్ తో సహీ' (ఓ మృత్యువా! నువ్వు నన్ను భూస్వామిని చేశావు, రెండు గజాల సమాధి అయినా సరే అది నా స్వంతం..) అంటూ ప్రసిద్ధ ఉర్దూ కవి రాహత్ ఇండోరి చమత్కరించారు. అయితే ఆయన భావన ఇప్పుడు తప్పనిపిస్తుంది. ఎందుకంటే, అనూహ్యంగా పెరిగిపోతున్న లేదా కృత్రిమంగా పెంచుతున్న స్థిరాస్థుల ధరలను పరిశీలిస్తే నివాసముండడానికి ఇల్లు సంగతి ఏమో గానీ మరణించిన తర్వాత సమాధికి కూడ స్థలం లేకుండాపోతోంది కదా. హైదరాబాద్ ఒకప్పుడు దరి చేరిన ప్రతీ ఒక్కరినీ అక్కున చేర్చుకున్నది. ఇప్పుడు సంపన్నులకు మాత్రమే స్వాగతం పలికే పరిస్థితి ఆ మహానగరానికి దాపురించింది.

# జెండా పండగ నాడు సగటు మనిషి ఆలోచనలు

సాధారణ పౌరుడు ఏమి ఆలోచిస్తాడు? మన స్వతంత్ర సమరయోధులు చేసిన త్యాగాలా? ప్రధాని చెప్తున్న ప్రగతా? దేశం ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లా ? నిత్య జీవితంలో ఎదురయ్యే ఇక్కట్లా? సామాన్య మనిషి ఆశలు, ఆకాంక్షలు పాలకులకు అర్ధమవుతాయా? తన అభిప్రాయాలు పాలకులకు తెలిపే అవకాశం సగటు మనిషికి వుందా? తన వేదన ఎవరికి నివేదన చేయగలడు ? తన ఆవేదనను ఎవరు ఆలకిస్తారు? తన మనోవేదనను ఎవరు తీరుస్తారు ?స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకునే వేళ సగటు పౌరుడి మనసులో వుండే ఆలోచనలేమిటి? సాధారణ భారతీయుడు ఈ రోజును పండగగానే చూస్తున్నాడా? మనసు నిండా దేశభక్తి నిండి వుందా? ప్రధాన మంత్రి ఎర్ర కోట నుంచి హావభావాలతో చేసే ప్రసంగం సగటు పౌరుడికి అర్ధమవుతుందా లేక ఊకదంపుడు ఉపన్యాసంగానే మిగిలిపోతుందా? సగటు పౌరుడు అంటే ఎవరు? ఎవరి మొఖానా సగటు పౌరుడు అని రాసి వుండదు. మీరు, నేను అందరం సగటు పౌరులవే (పండితులైనా, పామరులైనా, కిసాన్ అయినా, జవాన్ అయినా, ఆఫీసరైనా, గుమాస్తా అయినా). సంపాదనలో తారతమ్యాలు వుండొచ్చు. జీవన విధానంలో మార్పులు వుండవచ్చు. కానీ అందరం సామాన్య మనుషులమే. అందరి ఆశలు, ఆకాంక్షలు దాదాపుగా ఒకటే. అది ఎవరి స్థాయికి తగ్గట్టు వారు మెరుగైన జీవితం కోసం పడే ఆరాటం, చేసే పోరాటం. అదే జీవన తరంగం. కొద్ది మంది ఈ పోరాటంలో నెగ్గుతారు, కోట్లాదిమంది ఈ ఆరాటంతోనే అశువులు బాస్తున్నారు. మన దేశంలో జీవితాన్ని చాలా వరకు ప్రభుత్వమే శాసిస్తుంది. అభివృద్ధి కుంటుపడ కుండా, సంక్షేమ కార్యక్రమాలు అమలు చెయ్యటమే ప్రధాన ధ్యేయంగా చెబుతుంది ప్రభుత్వం. సంక్షేమం అంటే ప్రభుత్వానికి పెద్ద పాత్ర ఉందని అర్ధం. సంక్షేమం అనగానే మనకి గుర్తొచ్చేది బడుగు బలహీన వర్గాల ప్రజలు. ప్రజలందరి సంక్షేమం ప్రభుత్వ ధ్యేయమే అయినా సంక్షేమం అనగానే సమాజంలో అట్టడుగు వర్గాల వారే మొదటి ధ్యేయం. ఈ వర్గాలవారికి కనీస అవసరాలు తీర్చుకునే శక్తి ఉండదు. ఎందుకంటే వీరు కడు పేదరికంలో బతుకు బండిని నెట్టుకొస్తుంటారు. చదువు వుండదు, ఆస్తిపాస్తులు వీరు ఎరుగరు. కడుపు నిండా తిండి, ఒంటి నిండా బట్ట, తల దాచుకోవటానికి నీడ అనేవి సమాజంలో అట్టడుగు వర్గాల వారికి నెరవేరని కనీస కోరికలు. ఏ ప్రభుత్వమైనా వీరి సంక్షేమానికే పాటుపడుతున్నామనీ, వీరి అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నామని చెబుతుంది. కానీ అది ఆచరణలో ఏ మాత్రం సాధ్యమైంది, ఎంత మందికి చేయూతనిచ్చింది ?స్వతంత్ర దినోత్సవం నాడు పొద్దున్నే ప్రధాన మంత్రి ఎర్ర కోట మీద నుంచి దేశ ప్రజలనుద్దేశించి రాచరికాన్ని తలపించే రీతిలో ఉపన్యసిస్తారు. దేశం సాధించిన ప్రగతి, సాధించవలసిన లక్ష్యాలు, ఎదుర్కొంటున్న సమస్యల మీద మాట్లాడతారు. తన సారథ్యంలో ప్రభుత్వం సాధించిన ఘనత గురించి గొప్పగా చెబుతారు. కానీ ఈ ఉపన్యాసంతో ఎంతమంది కనెక్ట్ అవుతారు? సాధారణ పౌరుడు ఏమి ఆలోచిస్తాడు? మన స్వతంత్ర సమరయోధులు చేసిన త్యాగాలా? ప్రధాని చెప్తున్న ప్రగతా? దేశం ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లా? నిత్య జీవితంలో ఎదురయ్యే ఇక్కట్లా? సామాన్య మనిషి ఆశలు, ఆకాంక్షలు పాలకులకు అర్ధమవుతాయా? తన అభిప్రాయాలు పాలకులకు తెలిపే అవకాశం సగటు మనిషికి వుందా? తన వేదన ఎవరికి నివేదన చేయగలడు? తన ఆవేదనను ఎవరు ఆలకిస్తారు? తన మనోవేదనను ఎవరు తీరుస్తారు ? ఎర్ర కోట నుంచి ప్రధాని వల్లె వేసే గణాంకాలతో నిండిన ప్రగతి కబుర్లు, భావోద్వేగంతో చెప్పే అభివృద్ధి కథలకు, సగటు మనిషి జీవితానికి ఏమైనా సంబంధం వుందా? ప్రభుత్వ ప్రకటనల్లో, ప్రధానమంత్రి ఉపన్యాసంలో పేర్కొనే వృద్ధి రేటుతో సగటు మనిషి జీవితం మెరుగుపడిందా? ఇవి చాలామందిని వేధిస్తున్న ప్రశ్నలు. దీనికి ఎవరు సమాధానం ఇవ్వగలరు? వృద్ధి



రేటు పెరగటంతో సగటు మనిషి జీవనంలో గణనీయమైన మార్పులు వచ్చాయి? ఇది చదువుకున్నవారికీ అర్ధంగాని ప్రశ్న.ఏమి చదివుకున్నారో చెప్పని నాయకులకు ఏం అర్ధమవుతుంది వృద్ధి రేటు కథ? మనం సాధించామని చెబుతున్న ప్రగతితో సామాన్యుడిలో రేపటి గురించిన అభద్రత తగ్గిందా? మనం సాధించిన అభివృద్ధితో నేడు సగటు మనిషి అన్నంలో టొమాటో పప్పు తినగలుగుతున్నాడా? ప్రగతి అంకెలు, వృద్ధి రేటు కథలూ ప్రజలకు అర్ధం కాకపోవటానికి అసలు కారణం ఆ కథలు నిజ జీవితానికి కడు దూరంగా వుండటమే ! మనం స్వతంత్ర దేశంగా అభివృద్ధి చెందలేదని కాదు ఇక్కడ వాదన. స్వతంత్రం వచ్చిన నాటికి నేటికీ మన దేశ స్థితిగతుల్లో గణనీయమైన మార్పు వచ్చిన మాట కాదనలేని నిజం. నదులకు ఆనకట్టలు కడుతున్నాము, విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాము, వ్యవసాయానికి సాగునీరు అందిస్తున్నాము. దేశంలో చాలా వరకు విద్యుత్ సదుపాయం విస్తరించింది. ఒకనాడు సంపన్నుల ఇంట వుండే వంటగ్యాస్ ఇప్పుడు అందరికీ అందుబాటులో వుంది (బండ ఖరీదు బండెడు భారంగా మారింది. అది వేరే విషయం). జాతీయ రహదారులను అభివృద్ధి చేసుకున్నాము. రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నాము. రాజధాని, శతాబ్ది, వందే భారత్ లాంటి అధునాతన రైళ్లను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నడుపుతున్నాం. విమానాశ్రయాలు కడుతున్నాం. అంతరిక్షంలోకి విదేశాల ఉపగ్రహాలను కూడా పంపే స్థాయికి ఎదిగాం. చందమామ మీద కాలు మోపాలని ఆశపడుతున్నాం. ఇంటర్నెట్ వాడుతున్నాం, ప్రపంచంలో ఏ మూల ఏం జరుగుతున్నదో ఇట్టే తెలుసుకోగలుగుతున్నాం. నేడు ప్రపంచం మన వాణి వింటుంది. ఇది గర్వించదగ్గ ప్రగతి. సందేహం లేదు. కానీ, ఇది స్వతంత్రం వచ్చినప్పటి నుంచి అన్ని ప్రభుత్వాల సమిష్టి కృషి ఫలితం. చరిత్ర ఘనతను విస్మరించేవారు ఘనమైన చరిత్రను సృష్టించలేరన్నది చారిత్రక సత్యం. మనం సాధించిన ప్రగతి సమాజంలోని అట్టడుగు వర్గాలైన రిక్షా కార్మికుడు, రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముకునే చిరు వ్యాపారి, నాలుగు ఇళ్లలో పాచి పని చేస్తే గానీ జరగుబాటు లేని 'పనిమనిషి', మురికివాడలో బతికే జీవి, రెక్కాడితేగాని డొక్కాడని వ్యవసాయ కూలీ లాంటి కోట్లాది మంది ప్రజల జీవితాలను ఏ విధంగా ప్రభావితం చేయగలిగింది? ఈ ప్రశ్నకు సంతృప్తికరమైన సమాధానం లేదు. మన ప్రగతి ఫలాలు అట్టడుగు వర్గాలకు అందటం లేదన్న విషయాన్ని మనం అంగీకరించాలి. ముందు సమస్య ఉందని ఒప్పుకుంటేనేగదా సమస్యకు పరిష్కారం వెతకగలం. మనం సాధించిన అభివృద్ధి కొన్ని వర్గాలకే పరిమితమైంది. అన్ని వర్గాలవారికి ప్రగతి ఫలాలు అందించటంలో మనం విఫలమయ్యామని ఒప్పుకోవాలి. మనం మాట్లాడుకుంటున్న అట్టడుగు వర్గాల ప్రజలు వందే భారత్ రైలు ఎక్కగలరా? విమానాశ్రయం దరిదాపులకు పోగలరా? జాతీయ రహదారుల్లో కార్ల మీద తిరగగలరా? వీరికి ఆధునిక వైద్యం అందుబాటులో ఉందా? ఆధునిక విద్య అందుబాటులో ఉందా? విద్య వలన దిగువ మధ్య తరగతి వారు కొందరు మధ్య తరగతిలో కలిసిపోయారు, మధ్య తరగతివారు కొందరు ఎగువ మధ్య తరగతిలో కలిసిపోయారు, ఎగువ మధ్యతరగతి వారు కొందరు సంపన్నుల్లో కలిసిపోయారు, సంపన్నుల్లో కొందరు బ్యాంకులను మోసం చేసి దేశం వదిలి పారిపోయారు! మరి కొందరు దేశంలోనే వుండి కేంద్రంలో అధికార పార్టీలో చేరి వారి నేరాలను కడిగేసుకున్నారు! ఇదే కదా మన ప్రగతి కథ! విద్య వలన అట్టడుగు వర్గాలు ఇంకా తమ స్థితిగతులను మార్చుకోలేక పోతున్నాయి. మరి, అట్టడుగు వర్గాలకు చెందిన కోట్లాదిమంది జనులు ప్రభుత్వ ప్రగతి నివేదికలతో ఏ విధంగా కనెక్ట్ అవుతారు? అధికారులు పేదలను సంప్రదించకుండా, పేదలతో నిమిత్తం లేకుండా పేదరిక నిర్మూలన కోసం ఎక్కడో దూరాన ఏసీ గదుల్లో కూర్చొని పథకాలు రచిస్తుంటే పేదరికాన్ని ఎలా ఓడించగలం? నిజానికి, సమాజంలో పేదరికం ఉండటం పాలకులకు అవసరం. పేదరికం ఉంటేనేగదా దానిని నిర్మూలించేది? మన పాలకులకు పేదరికాన్ని కాపాడటం చాలా అవసరం ! అట్టడుగు వర్గాలవారి అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు రూపొందించామని అదేపనిగా చెబుతారు నాయకులు, అధికారులు. కానీ ఈ పథకాలకూ వీటిని ఉద్దేశించిన ప్రజలకు మధ్య ఎంతో అంతరం వుంది. దీన్ని పూడ్చలేక పోతున్నాము. దానికి కారణం పథకాలను రూపొందించేవారికి లబ్ధిదారుల అవసరాల పట్ల అవగాహన లేకపోవటమే. మన సమస్యలు అన్నిటికీ ఐఏఎస్ అధికారులే పరిష్కారం అనే ఆలోచన నుంచి బయటపడలేకపోతున్నాము. దానికి సమాధానం లేక విరుగుడుగా ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బు వెదజల్లుతున్నాము. కొన్ని రాష్ట్రాల చట్ట సభలకు మరి కొద్ది రోజుల్లో ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఆ తరువాత వచ్చే ఏడాది మొదటి సగభాగంలో పార్లమెంటుకు కూడా ఎన్నికలు వస్తాయి. డబ్బు పంపిణీ చేసే పండగ సీజను. ఇది హామీల సీజను కూడా. నది లేకపోయినా బ్రిడ్జి నిర్మిస్తామని హామీలు గుప్పించేవి రాబోయే రోజులు. పోయిన సారి ఎన్నికలప్పుడు ఏం హామీలిచ్చారు, వాటిని ఏ మేరకు నెరవేర్చారు, ఇప్పుడు ఇచ్చే హామీలు నెరవేర్చటానికి వీలైనవా లేక స్వర్గానికి నిచ్చెనలేసే విధంగా ఉన్నాయా అని నిశితంగా పరిశీలించాల్సిన చైతన్యం మనకు ఉండాల్సిన సమయమిది. అందుకే ప్రజాస్వామ్యంలో ఎన్నికల సమయం ప్రజలకు చాలా కీలకం. ఇప్పుడు గనక మనం జాగ్రత్త వహించకపోతే వచ్చే ఐదేళ్ళు నోరు మెదిపే అవకాశముండదు. ఎందుకంటే మన పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రజలు నేతలను నిలదీసి అడగగలిగేది ఎన్నికలప్పుడే. ఓటును అమ్ముకుంటే నిలదీసి అడిగే నైతిక హక్కు వుండదు. ఐదు వేళ్లతో ఐదేళ్లు నోటికి తాళం వేసుకోవాల్సిందే ! మనకి ప్రజాస్వామ్యం కొత్త. రాజ్యాంగ పాలన కొత్త. రాజ్యాంగం, హక్కులు, బాధ్యతల గురించి లోతైన అవగాహన లేదు మనకు. పుట్టుకతోనే వివక్షను వారసత్వపు బహుమతిగా పొందే వ్యవస్థ మనది. మనిషిని మనిషిగా గౌరవించి, బాధ్యతలు తెలుసుకొని, హక్కులను, కాపాడుకుంటామో అప్పుడే ప్రజాస్వామ్యానికి నిజమైన పండగ. మన ప్రజాస్వామ్యంలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య అంతరం తగ్గుతుంది. అభివృద్ధి ఫలాలు అందరికీ అందుతాయి. ప్రజలు స్వతంత్ర దినోత్సవ వేడుకలు, గణతంత్ర దినోత్సవ వేడుకలకు నిండు మనసుతో సులభంగా కనెక్ట్ అవుతారు. మనలో జాతీయతా వాదాన్ని బలపరచటానికి, ప్రపంచంలో మనం గౌరవప్రదమైన స్థానం పొందటానికి ఇదే సరైన మార్గం. అంతేగానీ ప్రజలు పేదరికం నుంచి బయట పడాలని కోరుతుంటే పాలకులేమో అయోధ్యలో మందిరం నిర్మిస్తాం, ఆర్టికల్ 370ని రద్దు చేశాం, ఏకరూప పౌరస్మృతిని తెస్తాం, హిందీని బలవంతంగా నేర్పుతాం...అనేది వితండవాదం. ఇవి అనుత్పాదక అంశాలు. వీటివలన ఎవరి కడుపూ నిండదు. ఈ ఉన్మాదంతో జాతీయతా భావం బలపడుతుందా, పలచబడుతుం దా? ఆలోచించవలసిన అవసరం ఎంతైనా వుంది. భారత్ అనేది ఒక వైవిధ్య భరితమైన భావన. విభిన్న జీవన విధానాలు విలసిల్లుతున్న ఈ భరత భూమి మీద రాజ్య విధానం ఎవరి గౌరవానికీ భంగం కలిగేలా వుండదు అన్న విశ్వాసాన్ని ప్రజల్లో నింపడం చాలా అవసరం. అప్పుడే మనం ఒక జాతిగా ఐకమత్యంతో ముందుకెళతాం. కానీ పాలకులు దీన్ని అర్ధం చేసుకోవటం లేదు. ఈ సత్యాన్ని అర్ధం చేసుకోవటంలోనే వుంది ప్రజాస్వామ్యానికి అర్ధం, పరమార్ధం. అప్పుడే మువ్వన్నెల జండాకి గౌరవం, జాతికి గర్వం. ఇదే నేడు సగటు మనిషి మదిలో మెదిలే ఆలోచన. ఈ వ్యాసానికి నేపథ్యం కూడా సగటు మనిషి ఆలోచనలే.

# యుగే యుగే చీకటిలోంచి ...


కన్నీళ్ళతో ఈ మంటలు ఆరేవి కాదు
కవిత్వాలతో ఈ క్రోధం తీరేది కాదు
కాలం ఏదో తీగ మీటుతోంది
యుగే యుగే చీకటిలోంచి
జాగో జాగో పాట పాడుతోంది

ఎంత పెద్ద దేశం ఇది..
ఇంత చిన్న గుండెను ఎన్ని దీపాలు చేసి
వెలిగించాలి!
గులాబీ రేకులనైనా
తాకడానికి వణికే చేతులు కదా మనవి
చిన్ని వెన్నెల చినుకు వాలినా
చలించిపోయే రెప్పలు కదా మనవి
పసిపాపల ముందు
ఎగిరి గంతులేసి ఆడుకునే
ప్రాణం ఉన్న గులకరాళ్ళం కదా మనం
కాలం ఇప్పుడు ఏదో సైగ చేస్తోంది!

కాలం బలి వేదిక మీద
నక్షత్ర ఖచిత సత్యాయుధం
నృత్యం చేస్తోంది
యుద్ధం తప్పదు కాబోలు–
సిద్ధంగా ఉండాలి తమ్ముడూ!
ఆత్మల కాగడాలు పట్టి
అడుగులు వేయాలి అమ్మడూ!

మన నెత్తి మీద ఆకాశం ఎటో
పారిపోకముందే
మన కాలి కింద భూమి ఎటో
కూలిపోకముందే
ధర్మం వొరలోంచి దేహాలను తీసి
దేశం పాదాల ముందు పెట్టాలి!
మబ్బుల బుగ్గలు నిమిరే మృదువైన
అరచేతులతో
పట్టాల్సి వస్తే ఆయుధం పట్టుకో తమ్ముడూ
పూలకు నవ్వుల తిలకాలు అద్దే
లేత చేతి వేళ్ళతో
పట్టాల్సివస్తే ఆయుధం పట్టుకో అమ్మడూ

ఇక మాటలతో సమరం కాదు
ఇది మౌనానికి సమయం కాదు
నువ్వో.. నేనో
ఒక మణిపూర్ కాకముందే
ధర్మ రక్షకుల చేతుల్లో
మన ప్రజాస్వామ్యం వివస్త్ర కాకముందే



తిరగబడు తిరగబడు తిరగబడు–
ఈ మాట అరిగిపోయినదే
అయినా లక్షసార్లు అంటాను

తిరగబడు తిరగబడు తిరగబడు–

కన్నీళ్ళతో ఈ మంటలు ఆరేవి కాదు
కవిత్వాలతో ఈ క్రోధం తీరేది కాదు

యుగే యుగే చీకటిలోంచి
జాగో జాగో పాట పాడు !

– ప్రసాదమూర్తి

## మానవ సేవయే మాధవ సేవ: మహేశ్వర శర్మ సిద్ధాంతి



సంగారెడ్డి, ప్రజాపాలన ప్రతినిధి:వాసవి మాఇల్లు స్వచ్ఛంద సంస్థ ప్రజల అవసరాలను గుర్తించి ఆధ్యాత్మిక, సామజిక సేవలు అందిస్తున్నందుకు సభ్యులందరు అభినందనీయులని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకుడు మహేశ్వర శర్మ సిద్దాంతి అన్నారు. వాసవి మా ఇల్లు సంస్థ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని పాత బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గొడుగుల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు మహేశ్వ శర్మ సిద్ధాంతి చేతుల మీదుగా వీధి వ్యాపారులకు గొడుగులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరోపకారార్ధ ఇదం శరీరం అన్న విధంగా సాధ్యమైనంత మానవ సేవ చేసి తరించాలని సూచించారు. వాసవి మా ఇల్లు సంస్థ సభ్యులు సామాజిక సేవలో తరించే ఐశ్వర్యం ఈశ్వరుడు కలిగించాలని ఆశీర్వచనం చేశారు. అంతకు ముందు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు తోపాజి అనంతకృష్ణ మాట్లాడుతూ సంగారెడ్డి పట్టణంలో ఒక వంద మంది వీధి వ్యాపారులకు ఈ గొడుగులను అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి పుల్లూరి ప్రకాష్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు మ్యాడం రాధా కిషన్, యువజన సంఘం ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, వాసవి క్లబ్ సభ్యులు ప్రదీప్ కుమార్, నామ భాస్కర్, నామ శ్రీనివాస్, లక్ష్మణ్, కొంపల్లి విద్యాసాగర్, వాసవి మాత దేవాలయ కమిటీ కోశాధికారి జూలకంటి మల్లేశం, వర్తక సంఘం పట్టణ అధ్యక్షుడు మదన్ మోహన్, కోశాధికారి సిద్దులు, స్థానిక కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కూన సంతోష్, నాగరాజు, బుచ్చిరాములు తదితరులు పాల్గొన్నారు.

## వాసవీ క్లబ్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



మంచిర్యాల టౌన్, ఆగష్టు 09, ప్రజాపాలన : మంచిర్యాల వాసవీ క్లబ్ వాసవి యూత్ క్లబ్ వాసవి కపుల్స్ క్లబ్ వాసవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేసి పలు రకాల మొక్కలను నాటారు. అంతర్జాతీయ వాసవీ క్లబ్ పిలుపు మేరకు విద్యా సేవ ప్రకృతి సేవ కార్యక్రమాలలో భాగంగా స్థానిక శ్రీ సరస్వతి శిశు మంధిర్ పాఠశాలలో విద్యార్థులకు 200 నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిరుపేద విద్యార్థులకు 200 నోటు పుస్తకాలను పంపిణీ చేసి పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షులు కటుకం హరీష్, జిల్లా గవర్నర్ కొండా చంద్రశేఖర్ మాట్లాడుతూ వాసవీ%ఎ%క్లబ్ అంతర్జాతీయ స్థాయిలో అన్ని వాసవి క్లబ్ స్థాయిలో విద్యా సేవలో భాగంగా నిరుపేద విద్యార్థులను ఎంపిక చేసి సరస్వతి పథకం ద్వారా ఉచితంగా నోటు బుక్స్ పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమాలలో వాసవీ క్లబ్ జిల్లా క్యాబినెట్ కార్యదర్శి అప్పాల శ్రీధర్ రీజియన్ ఛైర్పర్సన్ కొంకుముట్టి వెంకటేశ్వర్లు జోన్ ఛైర్మన్లు కేశెట్టి వంశీకృష్ణ గౌరిశెట్టి ధనలక్ష్మి జిల్లా కెసిజిఎఫ్ ఇంచార్జి ముస్త్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**బిజెపి జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్**



ఆసిఫాబాద్ జిల్లా ఆగస్టు 9 (ప్రజాపాలన,ప్రతినిధి) : జిల్లా కేంద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 30 వరకు జరిగే కార్యక్రమాల గురించి వివరించారు. జిల్లాలోని బిజెపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ప్రతి ఒక్కరూ ఆజాదిగా అమృత్ మహోత్సవంలో భాగంగా భారత దేశ కీర్తి ప్రతిష్టలు పెంచే విధంగా ప్రతి ఒక్కరూ 13,14,15, తేదీలలో జాతీయ పతాకాన్ని తమ తమ ఇండ్లపై ఎగరవేయాలని అన్నారు. అదేవిధంగా జాతీయపతాకాన్ని పట్టుకొని ఇంటింటికి తిరుగుతూ కుల మత భేదాలు లేకుండా భారత్ మాతాకీ జై అంటూ రాజకీయాలకతీతంగా జిల్లాలోని ప్రతి గ్రామంలో తిరుగుతూ ప్రతి ఇంటి నుండి మట్టి సేకరించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా పిలుపుమేరకు అందరూ దేశభక్తితో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సేర్ల మురళీధర్, పార్టీ నాయకులు శ్రీశైలం, ఆత్మారాం నాయక్, కిరణ్, చక్రపాణి, అశోక్, సొల్లు లక్ష్మి, వెంకటేష్, రెబ్బెన మండల్ నాయకులు పాల్గొన్నారు.

# ఖేడ్ నియోజకవర్గ పరిధిలో పనులు తనిఖీ చేసిన పిఆర్ ఎస్.ఇ



హైదరాబాద్ 9 ఆగష్టు ప్రజాపాలన: సంగారెడ్డి జిల్లా లో పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించిన మెదక్ రీజియన్ పి ఆర్. సూపరింటెండింగ్ ఇంజనీర్ జోగారెడ్డి. బుధవారం నాడు నారాయణ్ ఖేడ్ నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి పనులను పంచాయతీ రాజ్ సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.జోగారెడ్డి తనిఖీ చేశారు. నేషనల్ హైవే నుండి బల్కం చెల్క తాండ వరకు ప్రగతిలో ఉన్న రోడ్డు నిర్మాణం పనులను తనిఖీ చేశారు. సకాలంలో పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. నారాయణ్ ఖేడ్ జుక్కల్ లో ప్రగతి లో ఉన్న రెండు పడక గదుల ఇల్ల నిర్మాణం పనులను తనిఖీ చేశారు. జెజె కాంట్రాక్టర్ చేసిన ఇల్ల నిర్మాణం పనుల్లో ఇంటర్నెల్ కరెంటు, ప్లంబింగ్ మరియు నీటి సరఫరా తదితర చిన్న చిన్న పనులు పెండింగ్ లో ఉన్నాయి వాటిని వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. సిద్దారెడ్డి కాంట్రాక్టర్ కు మిగిలిన ఇల్ల నిర్మాణం పనులను త్వరలో పూర్తి చేయాలని ఫోన్ ద్వారా ఆశించారు.పంచగాం తూంనూర్ రోడ్డు ను తనిఖీ చేశారు.నల్లరేగడి నేల ఉండడం వల్ల రోడ్డు క్రస్టు ను పెంచాలని కాంట్రాక్టర్ మరియు స్థానికులు కోరారు.పనుల్లో నాణ్యత పరిణామాలు పాటించాలని సూచించారు. సకాలంలో పనులను పూర్తి చేసి బిల్లు లను పంపించాలని ఆదేశించారు. నారాయణ్ ఖేడ్ శాసన సభ్యులు భూపాల్ రెడ్డి పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పూర్తి చేసిన పనులను ఎంబి రికార్డు చేయడం లో ఆలస్యం జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ముఖ్యంగా మనూరు మరియు నాగల్ గిద్ద మండలం లో పనులు పూర్తి చేసిన ఎంబి రికార్డు చేయడం లేదని పలువురు సర్పంచులు కాంట్రాక్టర్లు ఎంఎల్ఎ తెలిపారు.పూర్తి చేసిన పనులను వెంటనే రికార్డు చేసి బిల్లు ఇప్పించాలని ఎంఎల్ఎ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కల్హేర్ మండల అసిస్టెంట్ ఇంజనీర్ మాధవ నాయుడు, నారాయణ్ ఖేడ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దుర్గా ప్రసాద్, మనూరు మండల అసిస్టెంట్ ఇంజనీర్ డి.బాలలింగం సంబంధిత కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## గృహలక్ష్మి దరఖాస్తు గడువు పెంచాలి: తెలుగుదేశం



మధిర ఆగస్టు 9 ప్రజాపాల ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో గృహలక్ష్మి దరఖాస్తు గడువు పెంచాలి తెలుగుదేశం పార్టీ కోరారు స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలోస్వంత స్థలం వుండి ఇల్లు లేని పేదవారికి నిజంగా ఇళ్ళు కట్టించాలనే సంకల్పం, చిత్తశుద్ధి వుంటే, దరఖాస్తు పెట్టుకోవటానికి యింత తక్కువ వ్యవధి ఈ ప్రభుత్వం ఆగస్టు 10 వ తేదీయిచ్చి వుండేది కాదని, ఇది వాస్తవంగా పేదోళ్లకు ఇళ్ళు కట్టే పథకమా లేకపోతే ఎన్నికలస్టంటు పథకమా, అన్న అనుమానం అందరిలో కలుగుతున్నదని టిడిపి రాష్ట్ర నాయకుడు చేకూరి కిషోర్ బాబు, ఐటిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేమూరి సునీల్, మధిర టౌన్ కార్యదర్శి చెరుకూరి కృష్ణారావు, ఆరోపించారు. ఆదాయ, కులధృవీకరణ పత్రాలు, భూమి హక్కు పత్రాలు, ఆధార్, రేషన్, బ్యాంక్ ఖాతా లకు సంబంధించిన నకళ్లన్నీ గృహలక్ష్మి దరఖాస్తుతోపాటు దాఖలుచేయాల్సి వుంటుందని, ఆదాయం, కులధృవీకరణ పత్రాలకోసం మీసేవ లో పెట్టుకున్న దరఖాస్తులను గ్రామాలవారిగా, వార్డుల వారిగా క్షేత్రస్థాయిలో విచారణచేసి, నివేదికలు ఆన్ లైన్ లో పెట్టి, ఆయా పత్రాలు తిరిగి మీ సేవ ద్వారా దరఖాస్తుదారులకు చేరాలంటే కనీసం వారం రోజులు పడుతుందని తెలిపారు. ఇల్లు వస్తుందని ఆశతో, ఎక్కువసంఖ్యలో పేదవారు దరఖాస్తు పెట్టుకుంటారని, ఇంత తక్కువ వ్యవధిలో అన్నింటిని విచారించటం అధికారులకు సాధ్యపడదని,బ్యాంక్ ఖాతా ఎవరికైనా లేకపోతే జీరో అకౌంట్ తో ఖాతా ప్రారంభించి పాస్ బుక్ తీసుకుంటే దీనికి కొంతసమయం పడుతుందని, ఒరిజినల్ భూమి హక్కు పత్రాలు అందుబాటులో లేకపోతే, వాటికి సంబంధించిన నకళ్లు సంబంధిత శాఖాధికారులద్వారా తీసుకోవాలంటే మరికొంత కాలయాపన తప్పదని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపల పేదవారికి దరఖాస్తుచేసుకోవటం సాధ్యపడదని, తూతూ మంత్రంగా నాలుగు యిళ్లు కట్టిచ్చి యిస్తే వాళ్లే పడుంటారనే ఉద్దేశ్యంతో ఈ ప్రభుత్వం తక్కువ గడువు పెట్టి, ఎక్కవ దరఖాస్తులు రాకుండా ఎత్తుగడ వేసిందన్న అనుమానం ప్రజల్లో వుందని, కట్టిన నాలుగిళ్లని రాబోయే ఎన్నికల్లో ఎరగా చూపించి, ఈసారి వస్తే మళ్లీ కడతాం అని ఆశపెట్టి పేదోడి పేదరికాన్ని అడ్డంపెట్టి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునే గడువు కనీసం నెలరోజులు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఖమ్మం టిడిపి పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు వంగాల రామకోటి, మహిళా విభాగం కార్యదర్శి మేడేపల్లి రాణి, మధిర రూరల్ మండలాధ్యక్షుడు మార్నీడి పుల్లావు, టిడిపి సీనియర్ నాయకులు పాశం రామనాథం, కోటేశ్వరరావు, నాగులవంచశ్రీను, గడ్డం మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

## ఆదివాసి గిరిజనుల స్వయం పాలన సాధనకై పోరాడుదాం: ఆదివాసి గిరిజన నాయకుల డిమాండ్



మంచిర్యాల టౌన్, ఆగష్టు 09, ప్రజాపాలన: ఆదివాసి గిరిజనుల స్వయం పాలన సాధనకై పోరాడుదాం అని ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా మంచిర్యాల జిల్లా కార్యదర్శి జాడి దేవ రాజ్ అన్నారు. బుధవారం రంగంపేట లోని కొమురం భీమ్ కు విగ్రహానికి నివాళులు అర్పించి ఆదివాసీ నాయకులు అరికిల్ల మల్లయ్య జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ పోరాటాల ఫలితంగా ఐక్యరాజ్య సమితి 1994లో ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించాలని పిలుపు ఇవ్వాల్సి వచ్చిందని ఇందులో భారత దేశం ఆమోదం అంగీకారం వుంది అని గుర్తు చేశారు. గిరిజనుల సంక్షేమం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని నిర్ణయించారు కానీ, ఆచరణలో భారత దేశం అధికారికంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించడం లేదని ఆదివాసీలకు రాజ్యాంగంలో కల్పించిన హక్కులు ఆదివాసీ గిరిజన చట్టాలైన 1/70 పీసా హక్కుల చట్టం సరిగా అమలు చేయటం లేదు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో వున్నా అమలు కావడం లేదని మండిపడ్డారు. గిరిజనులు సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూనే రాజ్యాంగం కల్పించిన హక్కులు చట్టాలు అమలు చేయమని ఆదివాసులకు స్వయంపాలన కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వాలు ఆదివాసి గిరిజన వ్యతిరేక విధానాలు విడనాడాలని ఆదివాసి గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను రక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొలవర్ సంఘం నాయకులు బి. బాపు నాయిని లచ్చులు శేఖర్ రమేష్ ప్రజాపంథా నాయకులు సయ్యద్ సాజిద్ ఉప్పలేటి సురేష్ గోపతి రాజలింగు సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పమ్మను పరామర్శించిన సర్పంచ్ మమత, కాంగ్రెస్ నాయకులు..



తల్లాడ, ఆగస్టు 9 (ప్రజా పాలన న్యూస్): తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన చింతల బాబు మాతృమూర్తి అప్పమ్మకు ఇటీవల కాలుకు గాయమైంది. ఈ నేపద్యంలో ఖమ్మంలో చికిత్స చేయించుకొని డిశ్చార్జ్ అయి స్వగృహానికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న అన్నారుగూడెం గ్రామ సర్పంచ్ మారేళ్ల మమత, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆమెను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని, ధైర్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పొన్నం కృష్ణయ్య, మాజీ ఎంపీటీసీ తాళ్ల జోసెఫ్, సిపిఎం నాయకులు పులి వెంకట నరసయ్య, కుటుంబ సభ్యులు చింతల నరేష్ ఉన్నారు.

## మధిర నియోజవర్గంలో బీసీ బందు చెక్కులు పంపిణీ



మధిర రూరల్ ఆగస్టు 9 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో స్థానిక వర్తక సంఘం కళ్యాణ్ మండపం లో ఏర్పాటు చేసిన బీసీ బందు చెక్కులు పంపిణీ కార్యక్రమం ముఖ్య అతిథి జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు పాల్గొని బీసీ బంధు చెక్కులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ బీసీ బందు నియోజకవర్గంలో బీసీ సోదరులు జీవితాలలో వెలుగులు నింపిన కెసిఆర్ ప్రభుత్వం వెనకబడ వారికి బీసీ బందు ప్రజల్లో చిరస్థాయిగా కేసీఆర్ ప్రభుత్వం చరిత్రలోనే ఇప్పటివరకు ఏ ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి పాటుపడన దాఖలాలు ఒక్క కెసిఆర్ మాత్రమే బీసీల బాంధవుడు అన్న లింగాల కమల రాజుతనను నమ్ముకున్న కార్యకర్తల కు బిసి బాంధవుడయ్యాడు జడ్పీ చైర్మన్ లింగాల కమల రాజుఅందుకే బీసీ బందు అన్ని బిఆర్ఎస్ పార్టీ వారికే మంజూరు..కమల అన్న పేదల పాలిటి పెన్నిధి అంటున్న మధిర నియోజకవర్గం ప్రజలు నీరాజనంతెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీల ఆర్థికంగా బలపడేందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు రాష్ట్ర వ్యాప్తంగా ప్రవేశపెట్టిన బీసీ బందు కు సంబంధించిన చెక్కులను స్థానిక ఎమ్మెల్యే మల్లు బట్టి విక్రమార్కతో కలిసి వర్తక సంఘం కళ్యాణమండపంలో నేడు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లింగాల కమల్ రాజు మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వం బీసీల కోసం చేయనన్ని కార్యక్రమాలను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి చేశారని , ఎన్నికల సందర్భంగా చేసిన హామీలనే కాదు... హామీ ఇవ్వని ఎన్నో పథకాలను బలుగు బలహీన వర్గాల కోసం ప్రవేశపెట్టి అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయులు కెసిఆర్ అని అన్నారు. బీసీ బందులో లింగాల కమల్ రాజు వర్గానికి చెందిన వారికే అధికంగా మంది రావడం పై టిఆర్ఎస్ పార్టీ నాయకుల్లో ఆనందం వెలివేరిసింది. కమల అన్నను పార్టీని నమ్ముకున్న నాయకులకు కార్యకర్తలకు బిఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా తోడు ఉంటుందని ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఐదు మండలాల ఎంపీడీవోలు చైర్మన్లు ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

## మర్చిపోయిన మొబైల్ ను ప్రయాణికుడికి అందజేసిన కండక్టర్



మధిర ఆగస్టు 9 ప్రజాపాలన ప్రతినిధి :ఖమ్మం నుండి మధిర వస్తున్న మధిర ఆర్టీసీ డిపోకు చెందిన 0669 నెంబర్ గల బస్సు లో రెబ్బవరం గ్రామం కు చెందిన ప్రయాణికుడి మొబైల్ ఫోను మరిచిపోగా అట్టి మొబైలను గమనించిన మధిర డిపో కండక్టర్ పి అనూష ఆ మొబైల్ ను రిటర్న్ టిప్పులో ఆ ప్యాసింజర్ కు అందజేశారు. ప్యాసింజర్ కండక్టర్కు కృతజ్ఞతలు తెలిపారు

## అన్ని దానాలలో కెల్లా అన్నదానం మిన్న: బాణాల శంకరాచారి



మధిర రూరల్ ఆగస్టు 9 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో మెయిన్ రోడ్ లోని వినాయక గుడి వద్ద అన్నదాన0లో భాగంగా ఈరోజు అన్నదాతలు కాలం రాములు, భద్రమ్మ, కాలం శశిరేఖ, కాలం వీరభద్రం వారి ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన మదిర వినాయక ఆలయ కమిటీ చైర్మన్ బాణాల శంకరాచారి.ఈ సందర్భంగా వినాయక ఆలయ కమిటీ చైర్మన్ బాణాల శంకరాచారి మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అన్ని దానాలలో కల్లా అన్నదానం మిన్న అని అన్నదాతలను అభినందించారు. ప్రతి ఒక్కరూ పుట్టినరోజు పెళ్లిరోజు సందర్భంగా వినాయకుని గుడి వద్ద అన్నదాన కార్యక్రమంనకు ఆర్థిక సహకారం అందించవలసినది గా కోరారు. ఈకార్యక్రమంలో పూజారి రవి శాస్త్రి, రేవంత్ శర్మ ,వలిశెట్టిశ్రీనివాసరావు,బాలు,గౌస్ పాల్గొన్నారు.

# అద్వాన స్థితిలో ప్రభుత్వ పాఠశాలలు

## కాంగ్రెస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి

## ఉప్పల్ ఎంఈఓ కార్యాలయాన్ని ముట్టడించిన కాంగ్రెస్ శ్రేణులు





మేడిపల్లి, ఆగస్టు 9 (ప్రజాపాలన ప్రతినిధి) :ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు లేక అద్వాన స్థితిలో ఉన్నాయని కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఉప్పల్లోని ఎంఈఓ కార్యాలయాన్ని రాగిడి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కార్యాలయాన్ని ముట్టడించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. వందలాదిగా కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం మరియు యువజన విభాగం కార్యకర్తలు నాయకులు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున ఎంఈఓ ఆఫీస్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో 10 డివిజన్లో సమస్యల సుడిగుండంలో సర్కారు బడులు కొట్టుమిట్టాడుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం కేజీ టు పీజీ విద్య ఉచితమని ఆర్భాటం చేసినప్పటికీ అనేక పాఠశాలలో ఇప్పటికీ అదనపు గదులు కొరత, ప్రహరీ లేకపోవడం, అవసరమైన కిచెన్ షెడ్లు, మరుగుదొడ్లు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని అన్నారు. తీవ్రమైన ఉపాధ్యాయుల కొరత వల్ల విద్యకు విఘాతం కలుగుతుందని, ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేయిస్తుందని మంత్రుల నుండి ఎమ్మెల్యేల వరకు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇవ్వడం తప్ప క్షేత్రస్థాయిలో మౌలిక వస్తువులు కల్పనతో పాటు ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తోందని తెలిపారు. ఈ బీఆర్ఎస్ ప్రభుత్వం ఉప్పల్ నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని చెప్పడమే తప్ప ఇప్పటివరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు కావున వెంటనే ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి డిగ్రీ కళాశాలకు సొంత బిల్డింగ్ నిర్మాణం చేయాలని రాగిడి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు గదులు లేక షిఫ్టులవారీగా విద్యార్థులకు బోధన అందించవలసి వస్తున్న దుస్థితి, కంప్యూటర్, మరియు ప్రాక్టికల్ ల్యాబ్లు లేక తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్న విద్యార్థిని విద్యార్థులు కనీసం మరుగుదొడ్లు కూడా లేని పరిస్థితిలో డిగ్రీ ప్రభుత్వ కళాశాల ఉందని తెలిపారు. ఉపాధ్యాయులు లేకుండా ఏ విధంగా నాణ్యమైన విద్య అందుతుందో అర్థం కావడం లేదు కంప్యూటర్ యుగంలో దూసుకుపోతున్న గొప్పలే తప్ప వసతుల కల్పనలో వెనుకబడ్డ ప్రభుత్వమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పించాల్సిన మౌలిక వసతులు కల్పించాలని రాగిడి లక్ష్మారెడ్డి ఉప్పల్ మండలం ఎంఈఓకు వినతి పత్రం అందజేశారు.

వెంటనే మౌలిక వసతులు మరియు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని లేని ఎడల పెద్ద ఎత్తున డీఈఓ ఆఫీసును మరియు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కార్యాలయాన్ని ముట్టడిస్తామని రాగిడి లక్ష్మారెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుధాకర్ శెట్టి, రామంతపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొహమ్మద్ రఫీక్, టిపిసిసి సభ్యులు వినోద్ ముదిరాజ్, టి పి సి సి మైనారిటీ జనరల్ సెక్రెటరీ షేక్ మదర్ వలి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వంజరి సంతోష్, పలకల నరసింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాచారం ఇన్చార్జి మేడల మల్లికార్జున గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఎస్టి సెల్ చైర్మన్ గణేష్ నాయక్, భాను గౌడ్, ఉప్పల్ నియోజకవర్గం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి, నీరజ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భద్రయ్య, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా యువజన కాంగ్రెస్ సెక్రెటరీ సాయిబాబా, రాజు నాయక్,రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి సాల్మన్ బాబు, మురళీకృష్ణ ముదిరాజ్, శ్యాం కుమార్, ముజీబ్, యువజన విభాగం నాయకుడు ప్రేమ్ గౌడ్, హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ ధర్మేంద్ర నాయక్ ఉప్పల్ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ వాసు నాయక్, ఎన్ ఎస్ యు ఐ వినయ్, వంజరి మల్లికార్జున్, అభినవ్ గౌడ్, ఉప్పల్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ సెక్రటరీ బొట్టు వెంకటరెడ్డి, శ్రావణ్ కుమార్, కరుణాకర్, అమరేందర్, కడమంచి వెంకటేష్, విన్ను, నవీన్, జనార్ధన్, రంగా తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ మిషన్లను పరిశీలించిన తహసీల్దార్



తాండూర్ ప్రజా పాలన ప్రతినిధి తాండూర్ నియోజకవర్గంలోని మండలంలో ఓటర్ మిషన్లను పరిశీలించారు. స్థానిక బషీరాబాద్ మండల తాసిల్దార్ వెంకటస్వామి ఓటర్ మిషన్లను ఓటర్ ఏవిఎంమిషన్లను ఓట్లు వేయించి నిర్వహించారు. బషీరాబాద్ మండల కేంద్రంలో కార్యాలయం ముందు మిషన్ లలో ఓట్లు వేయించి పరిశీలించారు. ఇందులో పోలీసులు ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు. మూడు నాలుగు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా మిషన్లను ప్రజల చేత ఓట్లు వేయించి పరిశీలిస్తున్నారు. ఓటర్ మిషన్లపై ప్రజలకు అవగాహన కలిగించి ఓట్లను వేయుటకు చైతన్యం అవగాహన కల్పిస్తున్నారు.

## గృహలక్ష్మి పథకం ఉత్తి మాటగా మిగులుతుంది

తాండూర్ ప్రజా పాలన ప్రతినిధి ప్రజలకు సొంతింటి నిర్మాణం కోసం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం పథకం ఉత్తి మాటగా మిగులుతుంది. దరఖాస్తు చేసుకున్న కునేందుకు మహిళలు మాత్రమే అవకాశం కల్పించి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లతో పట్టాసర్టిఫికెట్ మీద అని అడుగుతుండడంతో ప్రజలు ఇబ్బంది గురవుతున్నారు. అడుగు తేదీని కూడా పదవ తేదీ వరకు మాత్రమే ఇవ్వడంతో అనేకమంది పథకం కు దరఖాస్తు చేయలేక నిరసి చదువుతున్నారు విపతకం దీంతో ఉత్తి మాటగా మిగిలిపోతుంది. అధికారులు దరఖాస్తు కడుపునొప్పించాలని కోరుతున్నారు.

## సాంస్కృతిక కళాబృందం సీజనల్ వ్యాధులపై అవగాహన ప్రదర్శనలు



శంకరపట్నం ఆగస్టు0 9 ప్రజాపా లన రిపోర్టర్: రాష్ట్ర పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో వడ్లకొండ అనిల్ కుమార్ సారధ్యంలోని 20 మంది సభ్యులు గల సాంస్కృతిక కళాబృందం గ్రామ గ్రామాన ప్రదర్శనలిస్తూ బుధవారం శంకరపట్నం మండలం చేరుకుంది. మనదలంలోని ధర్మారం, అర్కండ్ల, అంబాలాపూర్ గ్రామాలలో కళాబృందం వారు ఆట,పాటలతో వర్షాకాలంలో ప్రబలే సిజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల సర్పంచులు చుక్కల రవి, షేర్ల అనిత శ్రీనివాస్, ముంజ వసంత, కళాకారులు నిజాముద్దీన్, ఒల్లాల వాణి, టి. రాజు,ఎ. కోమల, ఎం. శ్రీధర్, ఏ. శ్రీధర్, సురేష్, బి. శ్రావణ్, ఆర్. సాయి కుమార్, తిరుపతి, బబ్లు, సోనీ, సంధ్య, రాధా, పద్మ, ఆసియా, అర్చన, మురళి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేటి నుండి జిల్లాలో “మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమం”

మంచిర్యాల బ్యూరో, ( నిర్మల్ ) ఆగస్టు 09, ప్రజాపాలన. బోదకాల వ్యాధి నిర్మూలన కొరకు నిర్మల్ జిల్లాలో గురువారం నుండి అన్ని గ్రామాలలో, పట్టణాలలో మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్( సామూహికంగా మాత్రలను మింగించే కార్యక్రమం) కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి 1620 బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని. ప్రతి బృందంలో ఇద్దరు సభ్యులు సభ్యులు ఉంటారని తెలిపారు. ఆగస్టు 10 ,11 మరియు 12 తేదీలలో బూత్ స్థాయిలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, తర్వాత 13 నుండి 22వ తేదీ వరకు ఇంటింటికి సందర్శించి మాత్రలను మింగించే కార్యక్రమం కొనసాగుతుందని తెలియజేశారు. ఎవరైనా మిగిలిపోయి ఉంటే వారందరికీ 23, 24 వ తేదీలలో మాత్రలను మింగించడం జరు గుతుంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి అవసరమైన సామాగ్రి, ఐవర్ మెక్టిన్ డి. ఈ. సి, ఆల్బెండజోల్ మాత్రలు, కరపత్రాలు, ఫోల్డర్స్, డోస్ పోల్స్, ఫ్లాష్ కార్డ్స్, బ్యానర్స్, డ్రగ్ రిజిస్టర్స్ ను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపించడం జరిగిందని తెలియజేశారు. అర్హులైన ప్రజలందరూ కూడా ఈ మాత్రలను మింగడం వల్ల, సూక్ష్మ ఫైలేరియా వ్యాధిని నిర్మూలనతో పాటు, దోమల ద్వారా వ్యాధి వ్యాప్తి కాకుండా కాపాడవచ్చునని తెలియజేశారు. అందుకని అర్హులైన ప్రతి ఒక్కరు కూడా ఈ మాత్రలనువేసుకోవాలని కోరారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు



చేవెళ్ల,ఆగస్టు 09 (ప్రజా పాలన):రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ అన్నారు. చేవెళ్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ వార్డ్ మెంబర్లు, నాయకులు సుమారుగా 100 మంది కేఎల్ఆర్ నివాసంలో చేవెళ్ల నియోజకవర్గ సీనియర్ నాయకులు సున్నపు వసంతం పిఎసిఎస్ చైర్మన్ లు దేవర వెంకట్ రెడ్డి గోనె ప్రతాపరెడ్డి, బండారి ఆగిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జూకన్నగారి శ్రీకాంత్ రెడ్డి, సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ రోజు రోజుకు తెలంగాణ రాష్ట్రంలో బలపడుతుందని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్, సమన్వయ కమిటీ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు, షాబాద్ దర్శన్, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు రెడ్డి శెట్టి మధుసూదన్ గుప్తా,చేవెళ్ల ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ పిఎసిఎస్ చైర్మన్ నక్క బుచ్చిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జనార్దన్ రెడ్డి, చేవెళ్ల మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్లు పాటి దామోదర్ రెడ్డి,పైండ్ల మధుసూదన్ గుండాల రాములు, యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మధ్యల శ్రీనివాస్,వార్డు సభ్యులు మల్గారి మల్లారెడ్డి, జంగన్నోళ్ల హరికృష్ణ, మాజీ వార్డు సభ్యుడు చాకలి శ్రీనివాస్, రజక సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, మరియు సంఘం నాయకులు యూత్ నాయకులు కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలి..



తల్లాడ, ఆగస్టు 9 (ప్రజాపాలన న్యూస్): ఈనెల 10వ తేదీన తల్లాడ మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు దొడ్డా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను తల్లాడ మండల వ్యాప్తంగా నిర్వహించాలని, ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షులు ఇసనపల్లి శ్రీనివాసరావు కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా ఎంపీపీగా ఎన్నికై మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని తెలిపారు. అటువంటి నేత మరెన్నో జన్మదిన వేడుకలను జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని, రానున్న రోజుల్లో మరెన్నో ఉన్నత పదవులను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయనకి ముందస్తుగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ల్యాండ్ మాఫియా పై తెలుగుదేశం పార్టీ పోరాటం

### టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పోల్కర్ సాయిరాం




ఆసిఫాబాద్ జిల్లా ఆగస్టు 9 (ప్రజాపాలన,ప్రతినిధి) : ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో, జరుగుతున్న ల్యాండ్ మాఫియా పై తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోల్కర్ సాయిరాం అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పోల్కర్ సాయిరాం మాట్లాడుతూ ఆసిఫాబాద్ లో, పరిసర ప్రాంతాలలో, విచ్చలవిడిగా జరుగుతున్న “ల్యాండ్ మాఫియా పై” త్వరలో పోరాటం చేస్తామని అన్నారు. జిల్లా ఏర్పాటుతో ఇక్కడి భూములకు ఒక్కసారిగా ధరలు పెరగడంతో కొంతమంది సభ్యులుగా ఏర్పడి ల్యాండ్ మాఫియాకు తెరలేపుతున్నారని అన్నారు. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, ఇలా దేనిని కూడా వదలకుండా అక్రమించడం, ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్లు వేయడం, అమ్మేయడం జరుగుతుందన్నారు. అధికార పార్టీకి చెందిన వారు, రెవెన్యూ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది, ఒకచోట కలుసుకొని రక్కా ప్రణాళికలతో భూములను అక్రమించడం, జరుగుతుందని, పలుమార్లు పత్రికలలో కథనాలు వచ్చినప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. త్వరలో ఇలాంటి అక్రమ వెంచర్లపై పూర్తి సమాచారంతో హెచ్ఆర్సీలో ఫిర్యాదు చేస్తామన్నారు. ఉన్నతాధికారులు స్పందించకుంటే ఈ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు రాజు, సచిన్, జయేందర్, లు పాల్గొన్నారు.

## హోమియోపతి వైద్య శిబిరం




శంకరపట్నం ఆగస్టు 09 ప్రజాపాలన రిపోర్టర్: రాష్ట్ర ఆరోగ్యశాఖ ఆదేశాలతో సీజనల్ వ్యాధులపై బుధవారం శంకరపట్నం మండలం అంబాలాపూర్ గ్రామంలో ఆయుష్ డా. సి.సంధ్యా రాణి ఆధ్వర్యంలో హోమియోపతి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వర్షాకాలంలో ప్రబలే దగ్గు, జలుబు, జ్వరము, అతిసారం, కీళ్ల నొప్పులు, గొంతు నొప్పి, జీర్ణాశయ సమస్యలు వంటి వ్యాధులను గుర్తించారు. గ్రామంలోని 148 మంది రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ అర్చన, ఏఎన్ఎం కనకలక్ష్మి, ఆశా వర్కర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మజీద్ కమిటీ అధ్యక్షులుగా మస్తాన్, ఉపాధ్యక్షులుగా మేహారాజ్..



తల్లాడ, ఆగస్టు 9 (ప్రజా పాలన న్యూస్): తల్లాడ మసీదు నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా షేక్ మస్తాన్, ఉపాధ్యక్షులుగా మెహరాజ్, జాయింట్ సెక్రటరీగా ముస్తఫా, యాకూబ్ కోశాధికారిగా నిజాం, సెక్రెటరీగా జానీ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ ముస్లింల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరించడం జరుగుతుందన్నారు. ముస్లింలకు సహాయ సహకారాలను అందిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు అక్బర్, ఈసూబ్, చాంద్ పాషా, ముజఫర్, మున్నా, దస్తగిరి, అహ్మద్, మస్తాన్, నాగులుమీరా, బాబు, జానీ, యూసుఫ్, నిజాముద్దీన్, గాలిబ్, తదితరులు పాల్గొన్నారు.

# మహానీయులు త్యాగాల గుర్తుగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం

**అటవీ, పర్యావరణ, న్యాయ , దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి**



మంచిర్యాల బ్యూరో, ( నిర్మల్ ) అగస్టు9, ప్రజాపాలన:ఆదివాసీల హక్కులు, సంస్కృతి సాంప్రదాయాలకు పరిరక్షణ స్వయం పాలనకు ఎందరో మహానీయులు త్యాగాలు చేశారని, వారి పోరాటాలకు గుర్తుగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం జరుపుకుంటున్నామని అటవీ, పర్యావరణ, న్యాయ , దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో జడ్పి ఛైర్పర్సన్ విజయలక్ష్మి, జిల్లా పాలనాధికారి వరుణ్ రెడ్డి లతో కలిసి ఆయన కుమ్రం భీం, రాంజీ గోండు విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 1994 ఐక్యరాజ్య సమితి నిర్ణయం తో ప్రతీ సంవత్సరం ఆగస్టు 9వ తేదీన ఆదివాసి దినోత్సవం నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి పాలనలో గిరిజన గ్రామాలకు విద్యుత్ సదుపాయం లేక చీకటిలో మగ్గుతూ నివసించడానికి స్థలాలు, పక్కా గృహాలు లేక పూరిగుడిసెల్లో, పౌష్టికాహారం లేక, చదువుకు, సంపదకు , ఆహారానికి, ఆరోగ్యానికి నోచుకోలేక జీవనం కొనసాగించే వారని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఆదివాసీ, గిరిజనుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. వారి కోసం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో లక్ష ఎకరాల భూమిని 37 వేల కుటుంబాలకు అందజేస్తున్నామని, ఆదివాసీల గూడేలు, గిరిజన తండాలను జీపీలుగా ఏర్పాటు చేసి . మావ నాటే మావ రాజ్.. మా తాండాలో మా రాజ్యం అనే ఆదివాసీ గిరిజనుల ఆకాంక్షలను నెరవేర్చారన్నారు. విద్యా, ఉద్యోగ రంగాల్లో ఎస్టీ రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచిన ఘనత సీయం కేసీఆర్ కే దక్కిందన్నారు. జిల్లా పాలనాధికారి మాట్లాడుతూ ముఖ్యంగా విద్య పై ప్రత్యేక శ్రద్ద వహించి ఉన్నత స్థానాలకు ఎదగాలని అన్నారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉందని అన్నారు. కలెక్టర్ ముందుగా గోండు భాషలో మాట్లాడి అందరిని ఉత్తేజ పరిచారు. ఈ కార్యక్రమం లో డిటిడబ్ల్యూఓ అంబాజీ, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## గద్దర్‌కు నివాళులర్పించిన మండల కాంగ్రెస్ నాయకులు



బోనకల్ , ఆగస్టు 09 ప్రజా పాలన ప్రతినిధి: ప్రజా యుద్దనౌక గద్దర్ మరణం తీరని లోటని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి దుర్గారావు అన్నారు. బుధవారం రావినూతల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద గద్దర్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మోదుగు సుధీర్ బాబు,కర్నాటి రామ కోటేశ్వరరావులు మాట్లాడుతు పొడుస్తున్న పొద్దు మూగబోయిందని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రజా యుద్ధనౌకగా అభిమానులు పిలుచుకునే గాయకుడు గద్దర్ అని, సుదీర్ఘకాలం అతివాద వామపక్ష మద్దతు దారుగా ఆయన కొనసాగారని, చివరి దశలో ప్రజాస్వామ్య రాజకీయవాదిగా మారిన తర్వాత పార్టీలో పని చేశారని,ఆయన పాటతో తెలంగాణ ఉద్యమం ఉవ్వేత్తున ఎగిసిందని అన్నారు.తెలంగాణ ప్రజలను చైతన్యవంతులను చేసిన గద్దర్ మరణం తెలంగాణ ప్రజలను శోకసంద్రంలో ముంచిందిని అన్నారు.ప్రజా గాయకుడిగానే కాకుండా ప్రత్యక్ష రాజకీయాల్లో సైతం పాల్గొంటూ ఆయన ఆశ తీరకుండానే లోకం విడిచి వెళ్లడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు గాలి దుర్గారావు, జడ్పిటిసి మోదుగు సుధీర్ బాబు,కలకోట సహకార సంఘం అధ్యక్షులు కర్నాటి రామకోటేశ్వరరావు, నాయకులు మారుపల్లి ప్రేమ్ కుమార్, భూక్య బద్రునాయక్, చేబ్రోలు వెంకటేశ్వరరావు, షేక్ జానీ, వట్టికుంట కృష్ణయ్య, బంధం సైదులు తదితర నాయకులు పాల్గొన్నారు.

## రావినూతల యువత ఖాదర్ పాషాను ఆదర్శంగా తీసుకోవాలి



బోనకల్ ఆగస్టు 9 ప్రజా పాలన ప్రతినిధి:తెలంగాణ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ ఆదివారం ప్రకటించిన ఎస్సై ఫలితాలలో రావినూతల గ్రామానికి చెందిన షేక్ కరీం మీరభిలా దంపతుల తనయుడు షేక్ ఖాదర్ పాషా ఎస్సై ఉద్యోగం సాధించాడు.ఎస్సై ఉద్యోగం సాధించిన ఖాదర్ పాషను బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాలి దుర్గారావు,జెడ్పీటీసీ మోదుగు సుధీర్ బాబు,కో ఆప్షన్ సభ్యులు షేక్ జమాలుద్దిన్ ఘనంగా శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత అందరూ ఖాదర్ పాషాను ఆదర్శంగా తీసుకొని కష్టపడి చదివి ఉద్యోగం సాధించి జీవితంలో స్థిర ఉన్నత శిఖరాలకు ఎదగాలని,ప్రతీ ఒక్కరూ జీవితంలో ఒక లక్ష్యాన్ని పెట్టుకొని కష్టపడి ఆ లక్ష్యాన్ని చేరుకోని గ్రామానికీ, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మారుపల్లి ప్రేమ్ కుమార్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు చేబ్రోలు వేంకటేశ్వర్లు,గ్రామ శాఖా అధ్యక్షుడు వట్టికుంట రామ కృష్ణ, సీనియర్ నాయకులు షేక్ జానీ,చేబ్రోలు మల్లయ్య,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భూక్యా భద్రు ఆవునూరి సత్యనారాయణ,ఇండ్ల శ్రీను పాల్గొన్నారు.

## ఆదివాసీల సాంప్రదాయాలను ప్రతిఒక్కరూ గౌరవించాలి..

**టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మానవతారాయ్..**



తల్లాడ, ఆగస్టు 9 (ప్రజాపాలన న్యూస్): సమాజంలో ప్రతి ఒక్కరూ ఆదివాసీల సాంస్కృతి, సాంప్రదాయాలను గౌరవించాలని టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్ పిలుపునిచ్చారు. బుధవారం సత్తుపల్లి పట్టణంలోని మున్సిపాలిటీ వద్ద ఉన్న కొమరం భీమ్ విగ్రహానికి మొదట పూలమాలవేసి కొమరం భీం కి ఘన నివాళులర్పించారు.ఆదివాసీలకు మిఠాయిలు పంచి ఆదివాసీలకు శుభాకాంక్షలు తెలిపారు.ఆదివాసీతో కలిసి ఆదివాసీ సంప్రదాయ నృత్యం చేశారు. ఈ సందర్భంగా మానవతారాయ్ మాట్లాడుతూ ఆదివాసీలను వారి సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందన్నారు.ఆదివాసీ గిరిజనులు స్వేచ్ఛగా జీవించే హక్కును పాలక ప్రభుత్వాలు కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టియు సి సెంట్రల్ కౌన్సిల్ సెక్రటరీ రావి నాగేశ్వరరావు,తాటి వీరభద్రం,రాజులు,వెంకటేష్,రాజమ్మ,సత్తుపల్లి సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఐ క్రిష్ణ,పసల ఏడుకొండలు, కొమ్మేపలి ఖలీల్,కొమ్మేపల్లి బాజీ,కొమ్మేపల్లి యాకూబ్, కొమ్మేపల్లి యూసఫ్ పటాన్ పాల్గొన్నారు.

## సివిల్ ఎస్ఐగా ఎన్నికవ్వడం యువతకు గ్రామానికే ఆదర్శం

**ఇబ్రహీంపట్నం మండలం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేష్**



ఇబ్రహింపట్నం ఆగస్టు తేదీ 9 ప్రజాపాలన ప్రతినిది : తూలేకలాన్(పెత్తుల్ల) గ్రామానికి చెందిన కోన్రెడ్డి వీరయ్య కుమారుడు కోన్రెడ్డి శ్రీనివాస్ ను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అభినందించడం జరిగింది ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరు రమేష్ మాట్లాడుతూ మా గ్రామానికి చెందిన శ్రీనివాస్ సివిల్ ఎస్సైగా ఎన్నికవ్వడం మా గ్రామానికి ఆదర్శమని పేద కుటుంబంలో పుట్టి అనేక రకములైన ఇబ్బందులు పడుతూ తను అనుకున్న లక్ష్యాన్ని సాధించేంతవరకు పట్టు విడవకుండా అనుకున్న లక్ష్యాన్ని సాధించడం చాలా సంతోషకరము ఇంకా ఉన్నతమైన పదవులు అధిరోహించాలని గ్రామంలో ఉన్న యువత శ్రీనివాసును ఆదర్శంగా తీసుకోవలసిన అవసరం ఉందని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది విద్యార్థులకు నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు కోడూరి పాండు, యూత్ గ్రామ అధ్యక్షులు దాచేపల్లి సాయి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బోద నరసింహ, కోడూరి శంకర్, అచ్చున శివ కోడిసే శంకర్, దయ్యాల ఉమేష్, కోడూరి మహేష్ ,కోడూరి మల్లేష్ ,కలకొండ శివ, కోడూరి శ్రీను, కొన్రెడ్డి సాయి, బండ కిరణ్, దొడ్డి బీమా బండి శ్రీశాంత్, బన్నీ సిద్దు , బబ్బులు,జంగయ్య,కోడూరి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డిదారిన బీసీ వసతి గృహాల్లో ఉద్యోగ నియామకాలు

**ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాఫర్**



ఆసిఫాబాద్ జిల్లా ఆగస్టు 9 (ప్రజాపాలన,ప్రతినిధి) : జిల్లాలోని బీసీ వసతి గృహాలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా దొడ్డి దారిన ఇష్టారాజ్యంగా నియామకాలు చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ జాఫర్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో షేక్ జాఫర్ మాట్లాడుతూ జిల్లాలో బీసీ హాస్టల్స్, బీసీ గురుకులాలలో, ఓ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ, తీసుకుంది. ఆ ఏజెన్సీ వారు దొడ్డి దారిన బీసీ వసతి గృహాల్లో ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా కామాటి, వాచ్ మెన్, తదితర పోస్టులను బీసీ సంక్షేమ శాఖ అధికారి జిల్లా ఉపాధి కల్పనా శాఖ అధికారి ఔట్సోర్సింగ్ ఏజెన్సీ లతో కుమ్మక్కై ఉద్యోగాలని భర్తీ చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటివరకు ఆ శాఖలలో నింపిన పోస్టులు ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే భర్తీ చేస్తున్నారని అన్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ అందించి జిల్లా ఉపాధి కల్పనాధికారిపై, ఆ ఏజెన్సీ లపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా కొన్ని ఆశ్రమ పాఠశాలలో మెనూ పాటించటం లేదని, అలాంటి పాఠశాల పైన చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామ్ చందర్, ప్రశాంత్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## సమ్మె విరమణ తాత్కాలికమే...



మంచిర్యాల బ్యూరో, ఆగస్టు 09, ప్రజాపాలన:తమ న్యాయమైన డిమాండ్ లో సాధన కోసం సమ్మె చేపట్టిన గ్రామపంచాయతీ కార్మికులు మంత్రి ఎర్రవెల్లి దయాకర్ రావు జోక్యం తో బుధవారం సమ్మెను విరమించారు. గ్రామ పంచాయతీ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గత 34 రోజులుగా పనులు అన్ని బందు పెట్టి సమ్మె నిర్వహించడం జరిగింది. రెండు రోజుల క్రితం గ్రామ పంచాయతి జేఏసీ రాష్ట్ర నాయకత్వం తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ మంత్రి ఎర్రవెల్లి దయాకర్ రావు తో చర్చలు జరిపారు. దీంతో మంత్రి స్పందించి సమస్యలు పరిష్కరం చేస్తామని చెప్పిన హామీ మేరకు సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు పంచాయతీ జేఏసీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సమ్మెకు సహకరించిన, మద్దతుగా వచ్చిన రాజకీయ పార్టీలకు, ప్రజ సంఘాల నాయకులు అందరికి జెఎసి నాయకులు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసరి సురేష్ గ్రామ పంచాయతీ యూనియన్( సీఐటీయు ) జిల్లా అధ్యక్షులు, దుంపల రంజిత్ కుమార్ గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు (సీఐటీయు), మేకల రామన్న ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు, గోమాస ప్రకాష్ సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

## మంచినీటి పైపు లైన్లు పనులు ప్రారంభం కరాడి శ్రీలత అనిల్ కుమార్ కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్



ఇబ్రహింపట్నం ఆగస్టు తేదీ 9 ప్రజాపాలన ప్రతినిది: తాగునీటి కష్టాలను తెలుసుకొని నూతనంగా పైపులైన్లను ప్రారంభించిన శ్రీలత అనిల్ కుమార్ కౌన్సిలర్ బిజెపి ఫ్లోర్ లీడర్ కార్యక్రమంలో మాట్లాడుతూ చైర్మన్ మల్ రెడ్డి అనురాధ రామ్ రెడ్డి మరియు పాలకవర్గం సహకారంతో ఉమర్ ఖాన్ గూడ మరియు సంఘీ నగర్ లో అనేక కాలనీలకు నీటి ఎద్దడి సమస్యను ఏర్పడిందని నీటి సమస్యను తీర్చాలని ఉద్దేశంతో నూతనంగా పైపులైన్లను ద్వారా నీటి సమస్యను తీర్చే ఉద్దేశంతో పనులను ప్రారంభం చేయించడం జరుగుతుందని మేము ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొకటిగా నెరవేరుస్తూ గ్రామము మరియు వార్డు అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేస్తామని దానికి స్థానికంగా ప్రజలు మరియు అధికారులు కూడా సహకరించాలని కోరారు అలాగే విడుదలవారీగా వార్డులో అన్ని రకాలుగా అభివృద్ధి కార్యక్రమాలను చేస్తామని తెలిపారు భవిష్యత్తులో సమస్యలు లేని వార్డుగా తీర్చిదిద్దే లక్ష్యంతో పని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్జల జంగా రెడ్డి, బిక్కు మల్ల వెంకటేష్, గజ్జల సుదర్శన్ రెడ్డి, గొట్టే యోజిత్ , గొట్టే యువాచ్, దూల శంకరయ్య గౌడ్, కాలనీ వాసులు గ్రామస్తులు మరియు మున్సిపల్ సిబ్బంది బాలయ్య, యాదగిరి తదితరులు పాల్గొనడం జరిగింది.

## వైన్స్ టెండర్లకు 15 రోజుల గడువు, గృహలక్ష్మి పథకానికేమో 3 రోజులేనా: డీసీసీ సెక్రటరీ మునికుంట్ల సంతోష్ కుమార్ గౌడ్



ఇబ్రహింపట్నం ఆగస్టు తేదీ 9 ప్రజాపాలన ప్రతినిది:తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 10 సంవత్సరాలు కావస్తున్న ఇంతవరకు ఒక్క డబల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా మంజూరు చేయలేని బీ ఆర్ ఎస్ ప్రభుత్వం ఇప్పుడు ఆగమేఘాల మీద 3 రోజుల గడువుతో గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టడం శోచనీయం... గ్రామాల్లో నివసించే ప్రజలు గ్రామకంఠం భూములలో నివసిస్తారు. వాటికి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఉండవు. ఇప్పుడు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మహిళల పేరు మీద రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఉండాలని అంటున్నారు. ఇది ఆచరణ సాధ్యం కాదు. కేవలం వచ్చే ఎన్నికల్లో ఓట్లను దండుకోవడం కోసం మాత్రమే కెసిఆర్ వేసిన ఎత్తుగడగా ప్రజలు భావించాలి. రాబోయే ఎన్నికల్లో కెసిఆర్ కి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచాక అర్హులైన ప్రతి ఒక్కరికి అభయ హస్తం పథకం ద్వారా ఇల్లు నిర్మించుకోవడానికి 5 లక్షల రూపాయలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుంది.

## కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన రేషన్ డీలర్లు



ఇబ్రహింపట్నం ఆగస్టు తేదీ 9 ప్రజాపాలన ప్రతినిది :టన్ను బియ్యానికి 900రూ. నుండి 1400రూ. లకు కమిషన్ ను పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో హర్షం వ్యక్తం చేస్తూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ రేషన్ డీలర్లు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి తో కలిసి ముఖ్యమంత్రి కేసీఆర్‌లి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, వారి పరిపాలనకు కృతజ్ఞతలు తెలియజేసి మిఠాయిలు పంచుకున్నారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రము ఏర్పాటు సమయంలో డీలర్లకు కేవలం టన్ను బియ్యానికి 200రూ. కమిషన్ వచ్చేదని, ఇప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్ద మనసుతో ఏకంగా 900 రూ. నుండి 1400రూ. లకు పెంచారని అన్నారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్లు ముఖ్యమంత్రి కేసీఆర్ రికి రుణపడి ఉంటామని అన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, పీఏసిఎస్ చైర్మన్ పుల్లా రెడ్డి, నాయకులు రమేష్ గౌడ్, చక్రవర్తి గౌడ్, సర్పంచ్ కిరణ్, మండలాల రేషన్ డీలర్ల ప్రెసిడెంట్లు పి.యాదయ్య, వై.భానుచందర్ గౌడ్, ఎల్.మాధవ రెడ్డి, ఏ.రాజు గౌడ్, డీలర్లు ఎం.నవీన్, నాయుకులు రమేష్ గౌడ్, జాంగా రెడ్డి, అమరెందర్ రెడ్డి, జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సూపర్ స్టైలిష్ మేకోవర్ లో ఎన్టీఆర్ లేటెస్ట్ లుక్.!

ప్రస్తుతం యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా దర్శకుడు కొరటాల శివతో భారీ పాన్ ఇండియా చిత్రం "దేవర" చేస్తున్న సంగతి తెలిసిందే. మరి దీనిపై గ్లోబల్ లెవెల్ హైప్ రాగా ఈ చిత్రం షూటింగ్ ఇప్పుడు ఫుల్ స్వింగ్ లో నడుస్తుంది. ఇక ఈ చిత్రంతో పాటుగా తారక్ పలు యాడ్స్ కూడా చేస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగాలుగా తారక్ ప్రిపేర్ చేసిన లేటెస్ట్ లుక్ అయితే ఇప్పుడు కేజ్రీగా మారింది.ప్రముఖ హెయిర్ స్టైలిస్ట్ అలీమ్ హకీమ్ తారక్ ని సూపర్ స్టైలిష్ గా ప్రిపేర్ చేయగా ఓ మిర్రర్ పిక్ ని అయితే తాను తీసాడు. మరి ఇందులో మంచి స్మార్ట్ గా కూల్ లుక్ లో కనిపిస్తున్నాడు. అయితే ఇది ఓ యాడ్ కోసం రెడీ చేసిన లుక్ కాగా నిన్న అయితే తాను ఈ మేకోవర్ లోకి మారినట్టుగా తెలుస్తుంది. దీనితో ఈ పిక్ ఇప్పుడు ఫ్యాన్స్ కి ఓ రేంజ్ లో కిక్ ఇస్తుండగా మంచి వైరల్ గా కూడా మారింది.



# మహేష్ బర్త్ డే.. నమ్రత రొమాంటిక్ మూమెంట్

సూపర్ స్టార్ మహేష్ బాబు గురించి స్పెషల్ గా చెప్పాల్సిన అవసరం లేదు. ఆయనకు తెలుగు రాష్ట్రాల్లో విపరీతమైన క్రేజ్ ఉంది.కాగా, ఈ రోజు ఆయన పుట్టిన రోజు కావడంతో, సోషల్ మీడియాలో ఆయనకు శుభాకాంక్షల వర్షం కురుస్తోంది. అయితే, ఆయన భార్య నమ్రతా శిరోద్కర్ మరింత డిఫరెంట్ గా మహేష్ కి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. మహేష్ కానీ, నమ్రత కానీ, వారి పర్సనల్ ఫోటోలు షేర్ చేయడం చాలా తక్కువగా ఉంటుంది. అప్పుడెప్పుడో నమ్రతను కిస్ చేస్తున్న ఫోటోని మహేష్ షేర్ చేశారు. తాజాగా ఆమె మహేష్ ని వెనక నుంచి హత్తుకొని ఉన్న ఫోటోని షేర్ చేసి బర్త్ డే విషెస్ చెప్పడం విశేషం.ఫోటో చాలా రొమాంటిక్ గా ఉంది. మహేష్ ని ఆమె ప్రేమగా ఎంబీ అని పిలుచుకుంటారు. క్యాప్షన్ లోనూ అలానే ప్రస్తావించారు. ఇదిలా ఉండగా, ప్రస్తుతం మహేష్ త్రివిక్రమ్ దర్శకత్వంలో గుంటూరు కారం సినిమాలో చేస్తున్నాడు. వీరిద్దరి కాంబినేషన్ లో వస్తున్న మూడో సినిమా ఇది. ఈ మూవీ నుంచి తాజాగా మహేష్ లుక్ ని తెలియజేసేలా ఓ ఫోటో విడుదల చేశారు. అందులో ఆయన సూపర్ మాస్ గా కనిపిస్తున్నాడు. లుంగీ కట్టి, చేతిలో బీడీ పట్టుకొని ఉండగా, ఫ్యాన్స్ కి ఈ పోస్టర్ తెగ నచ్చేసింది. అయితే, ఈ మూవీ విషయంలో ఫ్యాన్స్ చాలా నిరుత్సాహంగా ఉన్నారు. ఎప్పుడో ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ సినిమా , కనీసం షూటింగ్ కూడా పూర్తి చేసుకోలేకపోయింది. హీరోయిన్ మారడం వల్ల మరింత ఆలస్యమౌతూ వస్తోంది. పూజా హెగ్డే హీరోయిన్ గా ఉండాల్సింది. కొన్ని కారణాల వల్ల ఆమె ఈ మూవీ నుంచి తప్పుకుంది. దీంతో, శ్రీలీల సెకండ్ హీరోయిన్ నుంచి మెయిన్ హీరోయిన్ గా మారిపోయింది. కాగా, మహేష్ బర్త్ డేకి కూడా కనీసం టీజర్, ట్రైలర్ ఉంటుందని అనుకున్నారు. కనీసం సాంగ్ అయినా ఉంటుందని భావించారు. కానీ, అవేమీ లేకుండా సింపుల్ గా ఓ పోస్టర్ విడుదల చేయడంతో ఫ్యాన్స్ బాగా హర్ట్ అయ్యారు. ఇదిలా ఉండగా, మహేష్ మాత్రం తన పుట్టిన రోజుని ఫ్యామిలీతో ఫారిన్ లో సెలబ్రేట్ చేసుకుంటున్నారు.




# వైరల్ గా మారిన రజినీ మాస్ స్పీచ్ డైలాగ్.!



కోలీవుడ్ తలైవర్ సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా మిల్కీ తమన్నా హీరోయిన్ గా దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించిన సాలిడ్ మాస్ ఎంటర్టైనర్ చిత్రం "జైలర్" కోసం తెలిసిందే. మరి భారీ హైప్ ని సెట్ చేసుకున్న ఈ చిత్రం ఆడియో లాంచ్ మొన్ననే చెన్నై లో జరిగింది. అయితే ఈ ఈవెంట్ లేటెస్ట్ గా టెలికాస్ట్ కి రాగా ఇందులో సూపర్ స్టార్ ఇచ్చిన మాస్ స్పీచ్ ఇప్పుడు క్రేజీగా మారింది.తనదైన స్టైల్ లో రజినీకాంత్ పర్టిక్యులర్ గా చెప్పిన కొన్ని మాటలు ఇప్పుడు పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి. "మొరగని కుక్క లేదు, విమర్శించని నోరు లేదు. ఈ రెండు లేని ఊరూ లేదు అందుకే మన పని మనం చేసుకుంటూ పోదాం..అర్థమైందా బచ్చా" అంటూ తన మార్క్ స్టైల్ లో చెప్పారు. దీనితో ఈ క్లిప్ సోషల్ మీడియాలో సహా ఫ్యాన్స్ అందరిలో ఒక్కసారిగా విపరీతంగా వైరల్ అవ్వడం స్టార్ట్ అయ్యింది. ఇక ఈ అవైటెడ్ చిత్రం అయితే రేపు ఆగస్ట్ 10న గ్రాండ్ గా పాన్ ఇండియా లెవెల్లో రిలీజ్ కాబోతుంది.

# మొత్తానికి డాన్ 3 ప్రకటన రావడమే ఆలస్యం

బాలీవుడ్ బాద్ షా షారుఖ్ ఖాన్ ను 2006 సంవత్సరంలో డాన్ గా చూపిస్తూ ఫర్హాన్ అక్తర్ హిందీ ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. గతంలో అమితాబచ్చన్ చేసిన డాన్ సినిమా కి ఏమాత్రం తీసి పోకుండా షారుఖ్ ఖాన్ డాన్ సినిమా ఉందంటూ విమర్శకుల ప్రశంసలు కూడా దక్కాయి. దాంతో సీక్వెల్ కు రెడీ అయ్యారు. 2011 లో అదే షారుఖ్ ఖాన్ తో ఫర్హాన్ అక్తర్ 'డాన్ 2' సినిమాను రూపొందించాడు. రెండు డాన్ సినిమాలు కూడా భారీ విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో గత రెండు మూడు సంవత్సరాలుగా డాన్ 3 సినిమా కోసం దర్శకుడు ఫర్హాన్ అక్తర్ తీవ్రంగా ప్రయత్నాలు చేస్తూ ఉన్నాడు. గత కొంత కాలంగా షారుఖ్ ఖాన్ ను డాన్ 3 కోసం ఒప్పించేందుకు ప్రయత్నాలు చేసిన దర్శకుడు తాజాగా తన ప్రయత్నాలు విరమించుకుని రణ్వీర్ సింగ్ తో వెళ్లాలని నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తుంది. డాన్ 3 సినిమాను రణ్వీర్ సింగ్ తో చేయబోతున్నట్లుగా అధికారికంగా కూడా ప్రకటన రావడం తో సోషల్ మీడియాలో ఎవరికి తోచిన విధంగా వారు మాట్లాడుతున్నారు. డాన్ సినిమాకు రణ్వీర్ సింగ్ ఎంపిక సరైనది కాదని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తూ ఉంటే మరి కొందరు మాత్రం షారుఖ్ ఖాన్ ను మరిపించే సత్తా రణ్వీర్ సింగ్ కు లేదని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. షారుఖ్ ఖాన్ చేసిన డాన్ పాత్రను తాను ఎలా చేయగలను అని రణ్వీర్ ఆలోచించుకోలేదా అంటూ కొందరు ఘాటుగానే విమర్శిస్తున్నారు. సోషల్ మీడియాలో ట్రోల్స్ మొదలు అయ్యాయి. బాద్ షా ఒప్పుకునే వరకు దర్శకుడు ఫర్హాన్ అక్తర్ వెయిట్ చేస్తే బాగుండేది అనేది కొందరి అభిప్రాయం. రణ్వీర్ సింగ్ అభిమానులు మాత్రం డాన్ 3 కి ఫర్హాన్ అక్తర్ సరైన ఎంపిక చేసుకున్నాడు అని సినిమా విడుదల తర్వాత అంతా అనుకుంటారనే నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. అన్ని అనుకున్నట్లుగా సజావుగా సాగితే 2025 లో డాన్ 3 పాన్ ఇండియా రేంజ్ లో భారీ ఎత్తున ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.



# ఇన్నాళ్ళకు మెగా 'దిల్' కాంబో..

వెంకట రమణా రెడ్డి అంటే ఎవరికీ తెలియకపోవచ్చు కానీ.. దిల్ రాజు అంటే సినీ పరిశ్రమలో తెలియని వారే ఉండకపోవచ్చు. కెరీర్ లో ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొని డిస్ట్రిబ్యూటర్ గా, ఆ తర్వాత నిర్మాతగా మారారు. శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై.. ఓ వైపు స్టార్ హీరోల సినిమాలను నిర్మిస్తూనే.. మరోవైపు కంటెంట్ బాగుంటే చిన్న సినిమాలనూ ప్రోత్సహిస్తూ కెరీర్ లో ముందుకు దూసుకువెళుతున్నారు. అలా 2003 నుంచి సినీ నిర్మాణ రంగంలో ఓ చెరగని ముద్ర వేశారు దిల్ రాజు. శతమానం భవతితో జాతీయ స్థాయి అవార్డు అందుకున్న ఆయన.. రీసెంట్ గా తన సమర్పణలో వచ్చిన బలగంతో అంతర్జాతీయ స్థాయిలో ఆకట్టుకున్నారు.అయితే తెలుగులో ఎంతో మంది స్టార్ హీరోలతో పని చేసిన ఆయన.. ఇద్దరు అగ్ర నటులతో మాత్రం సినిమా చేయలేకపోయారు. వారే మెగా స్టార్ చిరంజీవి, నందమూరి నటసింహం బాలకృష్ణ.అయితే ఇప్పుడు రానున్న రోజుల్లోనూ మంచి కథా చిత్రాలను తెరకెక్కించడమే లక్ష్యంగా పెట్టుకున్న దిల్ రాజు.. త్వరలోనే మెగా స్టార్ చిరంజీవితో ఓ సినిమా చేయబోతున్నారని సమాచారం అందింది. త్వరలోనే ఆయన బ్యానర్ పై చిరుతో కలిసి సినిమా చేస్తారని ప్రస్తుతం కథనాలు వస్తున్నాయి. ఇప్పటికే చర్చలు కూడా జరిగాయని, చిరు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిసింది. ఈ సినిమాకు డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తారని తెలిసింది. ప్రస్తుతం అనిల్.. బాలకృష్ణతో 'భగవంత్ కేసరి' సినిమా చేస్తున్నారు. ఇది అక్టోబర్ లో రిలీజ్ కానుంది. ఈ సినిమా పూర్తవ్వగానే చిరుతో సినిమా చేస్తారని ఇన్ సైడ్ టాక్. చిరు కోసం ఓ సాలిడ్ స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నారట. ఇకపోతే చిరంజీవిలో ఫన్ యాంగిల్ కాస్త ఎక్కువగానే ఉంటుంది. ఆయనకు ఊపు రావాలేగాని.. ఫన్ యాంగిల్ పీక్స్ లో ఉంటుంది. రీసెంట్ రిలీజైన వాల్తేరు వీరయ్యలో మస్త్ కామెడీ పండించారు. భోళా శంకర్ లోనూ అలాంటి కామెడీయే చేశారని ఇప్పటికే అర్థమైపోయింది. ఇక చిరు ఫన్ యాంగిల్ కు అనిల్ మార్క్ కామెడీ తోడైతే ఆ ఫన్ ఎంటర్ట్రైన్మెంట్ వేరే లెవల్ లో ఉంటుందని చెప్పొచ్చు.



# యూఎస్ లో రజినీకాంత్ "జైలర్" సెన్సేషన్!




రజనీకాంత్ టైటిల్ రోల్‌లో నటించిన కోలీవుడ్ మూవీ జైలర్ రేపు ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్ రిలీజ్ కి సిద్ధంగా ఉంది. బీస్ట్ ఫేమ్ నెల్సన్ దిలీప్‌కుమార్ ఈ బిగ్గీకి దర్శకుడు. ఈ చిత్రం విడుదలకు ముందే యుఎస్ బాక్సాఫీస్ వద్ద 800 కే డాలర్లు వసూలు చేయడం జరిగింది. ప్రీమియర్ల ద్వారానే ఈ సినిమా 1 మిలియన్ డాలర్ల మార్కును అందుకుంటుందని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. ఇదే జరిగితే, ఈ ఏడాది USA బాక్సాఫీస్ వద్ద 1 మిలియన్ మార్కును దాటిన మొదటి భారతీయ చిత్రంగా జైలర్ అవుతుంది. ట్రైలర్ మరియు ప్రచార చిత్రాల కారణంగా సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. తమన్నా భాటియా, మోహన్‌లాల్, జాకీ ష్రాఫ్, శివరాజ్‌కుమార్, వినాయకన్, సునీల్, యోగిబాబు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాలో రజనీకాంత్ భార్యగా రమ్యకృష్ణ నటిస్తోంది. ఈ చిత్రానికి సంగీతం అనిరుధ్ రవిచందర్ అందించగా, సన్ పిక్చర్స్ నిర్మించింది.


PAY BACK TO SOCIETY SNEHA CLUB

స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

INVESTORS AMONGST MEMBERS SNEHA MACS

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob
Dr. N. Venkateswarlu Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046 7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com


Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2/29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989